

# శబ్దవేధి




ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో, ఒక బాణం జుంయ్యిమంటూ కాలపాశంలా వచ్చి ముసలిగంగులు గుండెలో గుచ్చుకొన్నది. దెబ్బతో క్రిందపడిపోయా డతను. జాలిగుండె గల విజయవర్మ అతని గుండెలో గుచ్చుకొనివున్న బాణం లాగివేశాడు. పాపం, గంగులు ఒక్కసారి 'అబ్బా!'— అని మూలిగి ప్రాణాలు వదిలాడు. బాణం చేతిలో పట్టుకొనివున్న విజయవర్మ దానిని పరీక్షించి చూచి, 'ఇది చాలా చిత్రమైన బాణం' అన్నాడు. ఆ బాణంమీద "గంగులుకు 'శబ్దవేధి' కానుక" అని చిన్న అక్షరాలతో చెక్కివుంది. ఆ శబ్దవేధినిగురించిన ఈ చిత్రకథ కొన్నివందల ఏళ్ళనాటిది:

---

నేడు మధ్యప్రాంతమని పిలువబడుతున్న వింధ్యాచల పరిసరప్రాంతం ఆనాటికి చిన్న చిన్న రాజ్యాలుగా విభజింపబడి వుండేది. అప్పటికి హిందూ, బౌద్ధ సామ్రాజ్యాలు అంతరించిపోయినై. కాని మొగలులు ఇంకా అడుగుపెట్టలేదు. చాలా గడ్డురోజులవి. అదుపులో పెట్టేవారు లేక చిన్నచిన్న సామంతులు తమలోతాము కొట్లాడుకుంటూ వుండేవారు. దేశం అరాచకంగా, అల్లకల్లోలంగా ఉండేది. అబోతుల పోరులో లేగదూడలు నలిగిచచ్చినట్టు ఈ ప్రభువుల కొట్లాటల్లో ప్రజలు నలిగిచచ్చేవారు. సరే, ఇక జమీందారుల సంగతి, ఖామందుల సంగతీ చెప్పేదేమిటి? ఒక్కొక్కరు ఒక్కొక్క చిన్నదండు ప్రోగుచేసి వాటి సాయంతో లోకులను దోచుకొంటూ ఉండేవారు. ఇందువల్ల ఆరోజుల్లో ఏ అండా లేని పేదవారికి బొత్తుగా రక్షణ వుండేదికాదు.




నాడు వింధ్యపరిసరాల్లో పెద్దరాజ్యాలని చెప్పతగినవి రెండే ఉండేవి: ఒకటి బీసల్పూరు రాజ్యం. రెండవది కోసల్పూరు రాజ్యం. ఈ రాజ్యాల అధిపతులిద్దరూ సూర్యవంశీయులు. వారి తాతలు అన్నదమ్ముల బిడ్డలు. ఏదో గృహకలహం వచ్చి ఇదివరకు ఒకటిగా వస్తున్న బీసల్పూరు రాజ్యాన్ని ఇద్దరూ చెరిసగం పంచుకొన్నారు. ఈవిధంగా కోసల్పూరురాజ్యం ఏర్పడింది.


అప్పటినుంచి ఈ రెండు రాజ్యాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గున మండుతూ వచ్చింది. దాయాదుల పోరు ఎవ్వరెరుగనిది! మన కథాప్రారంభాన ఒకనాటి సాయంకాలం, కోసల్పూరు సరిహద్దులలోని గిరికోటలో రణభేరి మ్రోగసాగింది. గిరికోట కోసల్పూర్‌లోనిదే ఐనా బీసల్పూర్ రాజ్య సరిహద్దును తాకుతూ ఉంటుంది. ఆ కోట యజమాని పేరు భీమవర్మ. ఆయన ప్రస్తుతం కోటలో లేడు. సైనికులతో సహా రామనగర్ వెళ్ళిఉన్నాడు. ఇప్పుడు ఆయన పురోహితుడూ, అంతరంగిక మిత్రుడూ ఐన సోమశర్మే దుర్గాధిపతి.

రణభేరి వినగానే, రామనగర్ వెళ్ళగా కోటలో మిగిలివున్న పురుషులంతా ఎక్కడి పని అక్కడనే వదిలేసి, మొగసాలవద్ద ప్రోగయినారు. అక్కడ పదిహేడు పద్దెనిమిదేండ్ల రౌతు ఒకడు సమస్తమైన ఆయుధాలూ ధరించి నిలబడిఉన్నాడు. అతడే భీమవర్మ పెంచుతున్న యువకుడు. అతని పేరు విజయవర్మ.

ఈ ప్రోగయిన పౌరులు 'అసలుసంగతి ఏమిటీ?' అని ఒకరినొకరు ప్రశ్నించుకోవటం చూచి ఆ యువకుడు మళ్ళీ కోసల్పూరు, బీసల్పూర్ రాజ్యాల రెండిటిమధ్యా యుద్ధం జరుగబోతున్నదనీ, భీమవర్మ గారలు ఆయుధం పట్టగల ప్రతి పురుషుణ్ణీ తోడ్కొని రమ్మని కబురంపారనీ, వారికి చెప్పాడు.

ఈ సైనికుల జట్టుకు రామసింగు నాయకుడుగా వుంటాడనీ, సోమశర్మగారు ఈ విషయమై స్వయంగా అజ్ఞాపిస్తారనికూడా చెప్పాడు ఆ యువకుడు.

ఈవార్త విని జనులు రకరకాలుగా మాట్లాడుకొనసాగారు. దుర్గాధిపతి ఐన భీమవర్మ అంటే వారికెవరికీ అట్టే ఇష్టంలేదని ఆ మాటలవల్ల స్పష్టంగా తెలుస్తుంది. ఇంతలోనే గుర్రం ఎక్కి రామసింగుకూడావచ్చాడు.




వచ్చీరావటంతోనే అతడు 'అంతా సిద్ధంకండి. చీకటి పడకముందే మనం బయలుదేరాలి' అన్నాడు. రామసింగు అంటే భీమవర్మగారికి కుడిబుజంలాంటివాడు. అయన అజ్ఞప్రకారం ఎక్కడివాళ్ళక్కడ అంతా సిద్ధంకాసాగారు. ఇంతలో రామసింగు ఒకనిని పిలచి 'ముసలి గంగు ఎక్కడ?' అని అడిగాడు.

'బహుశా చేనుపనిలో ఉండివుంటాడు' అని ఆ వ్యక్తి జవాబుచెప్పాడు. ముసలి గంగులు చేను కోటబయట వున్నది. విజయవర్మా, రామసింగూ ఇద్దరూ అక్కడికి దౌడుతీశారు.

ముసలిగంగులు చేలో పనిచేసుకుంటూ ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. వీళ్ళిద్దరూ వచ్చిన అలికిడి విన్నాడో లేదో, తలెత్తికూడా చూడలేదు. 'ఏమయ్యా గంగయ్యా! నీకు పిలుపు వచ్చింది. ఇప్పుడే వచ్చి కోటలోని సైనికులకు నాయకత్వంవహించమని సోమశర్మగారి అజ్ఞ' అని అన్నాడు రామసింగు.

'నువ్వు ఉన్నావుగదయ్యా' అన్నాడు గంగులు నవ్వుతూ. 'అయన వుండడు. కోటలో ఉన్నవారందరినీ ప్రోగుచేసుకుని అయన రామనగర్ వెళ్లబోతున్నాడు. భీమవర్మగారు కబురంపించారు' అన్నాడు విజయవర్మ.

'అయితే మరి నేనిక్కడ నాయకత్వం వహించే దెవరికి?' అన్నాడు గంగులు.




'ఆరుగురు సైనికులూ, సోమశర్మగారూ ఇక్కడ వుంటారు' అన్నాడు రామసింగు. కాని గంగులు అతని మాట విననేలేదు.

అతడు దగ్గరలోనే ఉన్న అరణ్యంవైపు చూస్తున్నాడు. 'ఏమిటంత దీక్షగా చూస్తున్నావు?' అని అడిగాడు రామసింగు. 'పక్షులు' అన్నాడు గంగులు అలాగే చూస్తూ. రెండువందల గజాల దూరంలో ఉన్న చెట్లగుబురుమీద ఒక పక్షులగుంపు చెల్లాచెదురుగా ఎగురుతూ అరుస్తున్నది.


'పక్షుల్ని చూచేదేమిటయ్యా?' అన్నాడు రామసింగు. 'అదే తెలివితక్కువ. పక్షులంటే అరణ్యానికి కాపలా. క్రొత్త వాళ్ళెవరు వచ్చినా వాటి అలజడివల్ల మనకు ముందే తెలుస్తుంది. ఇప్పుడా చెట్ల గుబురులో శత్రువులే పొంచి ఉన్నారనుకో, నీ కెలా తెలుస్తుంది?' అన్నాడు గంగులు.

'శత్రువు లెక్కడినుంచి వస్తారయ్యా ఇక్కడికి? రాంనగర్‌లో ఉన్న మన సైన్యాలు తప్ప దగ్గరలో వేరే సైన్యాలు లేనిదే?' అన్నాడు రామసింగు. 'ఓయి పిచ్చివాడా! భీమవర్మనూ, అతని అనుచరులనూ దెబ్బతీయడానికి వేరెక్కడినుంచో రావాలటయ్యా శత్రువులు? ఈ చుట్టుపట్ల ఉన్నవారిలో మనని ద్వేషించని వారెవరు?' అన్నాడు గంగులు.

రామసింగు నోటినుంచి కొంచెంసేపు మాట రాలేదు. గంగులు చెప్పినది నిజమన్న సంగతి అతనికి బాగా తెలుసు. 'సరే, సరే, ఇక పద. సోమశర్మగారు ఇప్పటికే మండిపడుతూ ఉంటారు. ఐనా నీ నోటికి హద్దులేదు' అన్నాడు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో, ఒక బాణం జుంయ్యిమంటూ కాలపాశంలా వచ్చి ముసలి గంగులు గుండెలో గుచ్చుకొన్నది. దెబ్బతో క్రింద పడిపోయా డతను. రామసింగు ఒక్కగంతువేసి దగ్గరనే ఉన్న ఒక

ఖండరాయి వెనుక దాగాడు. విజయవర్మ తన ధనుస్సు తీసి, బాణం ఎక్కుపెట్టి అరణ్యంవైపు చూడసాగాడు. కాని అరణ్యం ప్రశాంతంగా ఉంది. ఆకు ఐనా కదలలేదు.

రామసింగూ, విజయవర్మా బాధతో కొట్టుకలాడుతున్న గంగులువద్దకు వెళ్లారు. జాలిగుండెగల విజయవర్మ అతని గుండెలో గుచ్చుకొనివున్న బాణం లాగివేశాడు. పాపం, గంగులు ఒక్కసారి 'అబ్బా!' అని మూలిగి ప్రాణాలు వదలాడు.



చేతిలో బాణం పట్టుకొనివున్న విజయవర్మ దానిని పరీక్షించిచూచి 'ఇది చాలా చిత్రమైన బాణం' అన్నాడు. 'ఏదీ, నన్ను చూడనీ?' అని రామసింగు బాణం తీసికొనబోయాడు. విజయవర్మ బాణంమీదనున్న నెత్తురు తుడిచి చూపించాడు. ఆ బాణం మీద ''గంగులుకు 'శబ్దవేధి' కానుక'' అని చిన్న అక్షరాలతో చెక్కవుంది. 'శబ్దవేధి? ఎవరీ శబ్దవేధి? దొంగపేరులాగుందే? సరే, మనక్కూడా ఇదేగతి పట్టిందాకా ఇక్కడ ఎందుకు కూచోవాలి? గంగులు లేడుగనుక కనీసం గంగులు శవాన్నయినా తీసుకపోదాం పద' అన్నాడు రామసింగు.

ఇద్దరూ కలిసి గంగులు శవాన్ని దగ్గరలోనే ఉన్న అతనింటికి మోసుకువెళ్ళారు. వెంటనే సోమశర్మకు ఖబురువెళ్ళింది. అతడు కొద్దిసేపట్లోనే 'ఏమయ్యా! ఏమి జరిగిందేమిటి?' అంటూ వచ్చాడు. 'ఇంకేం జరగాలనీ? గంగులును చంపేశారు!' అన్నాడు రామసింగు.

ఈ వార్త వినగానే సోమశర్మకు ముచ్చెమటలు పోశాయి. ముఖం వెలవెలబోయింది. కాళ్లు గజగజ వణికాయి. ఆసనంమీద కూలబడ్డాడు.

'ఇది ఎలా జరిగివుంటుంది?' అని బొంగురుగొంతుకతో అన్నాడు. అప్పుడు



విజయవర్మ అతనికి ఆ బాణం చూపించాడు. 'శబ్దవేధి? శబ్దవేధి పేరుతో నాటక మాడుతున్న ఈ శత్రువు ఎవరు? మన చెరుపు కోరేవారు చాలమంది ఉంటారు. కాని ఇంతటి సాహసం ఎవరికుంది! ఎవడితడు? బాబూసింగా? కాదు. ప్రమార్ వంశంవాడా? కాదు. మరెవరై ఉంటాడు? ఏమంటావు సింగూ!' అన్నాడు సోమశర్మ. 'చండీదాసు కాగూడదా?' అన్నాడు సింగు.

'లేదు. లేదు. అలాంటివాళ్ళకి అంత సాహసం ఎన్నడూ కలగదు. మళ్ళీ యుద్ధం రేగబోతుంది. తప్పకుండా ఎవడో టీసల్పూరువాడే ఈ పని చేసివుంటాడు' అన్నాడు సోమశర్మ. 'మీరు బలేవారండీ? అన్నీ తెలిసీ ఇలా అంటారేం సోమశర్మగారూ! మన భీమవర్మగారికి ఒక పక్షమనేది లేదన్న విషయం ఎవరికి తెలియదు? గిట్టుబాటుగా ఉండేపక్షం ఉంటాడాయన. శత్రువులు బయటనుంచే రావాలా? ఆయన ఎన్ని కొంపలు కూల్చలేదు? ఎన్ని ఘోరాలు చేయించలేదు? ఎన్ని నిండు ప్రాణాలు తీయలేదు?' అని ఆవేశపడుతూనే సింగు హఠాత్తుగా ఆగిపోయాడు.

సోమశర్మ చల్లగా అంటున్నాడు— 'సింగూ, నీ నోరు కొంచెం దురుసు. ఎందుకైనా మంచిది. కొంచెం అదుపులో పెట్టుకో. తరువాత విచారించి లాభం లేదు' అని, మాటమార్చి 'గంగులు లేడు. నిన్ను పంపితే కుదరదు. నువ్విక్కడే ఉండాలి. కాలం మంచిదికాదు' అన్నాడు.

ముగ్గురూ బయటకు వచ్చారు. వచ్చి గుర్రాలెక్కి మొగసాలవైపు వెళ్ళారు. అక్కడ ప్రోగైవున్న సైనికులను చూడగానే సోమశర్మకు కొంత ఊరట కలిగింది. 'పరవాలేదు. భీమవర్మగారు కోపపడవలసిన పని ఉండదు' అన్నాడు. ఇంతలో 'అతనెవరు?' అంటూ సింగు ఉలిక్కిపడ్డాడు.

ఎవడో మొగసాల వెనుకనుంచి పారిపోతూ కనుపించాడు. 'పట్టుకోండి, చూస్తారేం?' అని సింగు ఒక్క కేకవేసి గుర్రాన్ని దౌడుతీయించసాగాడు. చాలా మంది అతనిని అనుసరించారు. కాని అందరికంటే తెలివైన పని చేశాడు విజయ వర్మ. బాణం ఎక్కుపెట్టి కొట్టాడు. కాని గురి సరిగా లేకపోవటంవల్ల బాణం ఆక్రొత్త వాని గుర్రాన్ని రాసుకొంటూపోయింది.

ఐతే, అతడు అదృష్టవంతుడు. అందరినీ తప్పించుకొనిపోయి అరణ్యంలో మాయ మయ్యాడు. నిరాశచెంది తిరిగివచ్చారు అంతా. ఇంతలో నారాయణ—సోమశర్మ అనుచరుడు–'ఇదేమిటో చూడండి' అంటూ ఒక లేఖ పట్టుకొచ్చాడు. దానిమీద చిత్ర మైన పాట ఒకటి రాసివుంది. సోమశర్మ ఆపాట ఇలా చదువసాగాడు:—

నాదగ్గరనే వున్నాయండీ, నాలుగు బాణాలు.
మంచి వాడిగలవవి, తీస్తాయా దుష్టుల ప్రాణాలు.
ముసలిగంగుగుండెల నొకబాణం రివ్వున దూసింది.
శాస్తిజరిగినది ముసలిగంగులుకు, తప్పదు రాసింది.
క్రూరుడు రామసింగుకోసం ఒకబాణం దాచాను.
వాడేగావా సోంనగర్ తగలెట్టిన సైతాను.
సోమశర్మకోసం ఒకబాణం దాచేవుంచాను.



అభయవర్మ గొంతుక కోశాడె చేతులార తాను.
భీమవర్మ ద్రోహికి నాల్గవదే, కాదనగలదెవడూ?
యాదవవంశపు ముసలం వాడే, వాడుకాక ఎవడు?
ద్రోహుల్లారా! మీమీ చేతలు తలచుకొనండింకా.
మీ వేల్పులు ఎవరన్నా వుంటే పిలుచుకొనండింకా.

ఇట్లు శబ్దవేధి,
అతని అనుచరులు.

ఇది చదివి సోమశర్మ 'అయ్యయ్యో! ఎంతఘోరం! ఎంతఘోరం! పైగా నేను అభయవర్మ గొంతు కోశానట. ఇంతకంటే పచ్చిఅబద్ధం ఇంకేమన్నా వుందా?' అనటం మొదలెట్టాడు.


అప్పుడు రామసింగు అతని దగ్గరకు వెళ్ళి చెవిలో ఏదో చెప్పాడు. వెంటనే సోమశర్మ నోరు కట్టుబడిపోయింది. అతడు విజయవర్మవైపు బెదురుగా చూడసాగాడు. దీనికి కారణం విజయవర్మ గ్రహించక పోలేదు. అతని తండ్రిపేరే అభయవర్మ. అసలుసంగతి ఏమిటో ఎవరికీ తెలియదు. కాని, మొత్తానికి అతని తండ్రి చాలా ఏళ్ళ క్రితం గిరికోటలోనే హత్యచేయబడ్డాడు.


అప్పటిలో ఆ హత్యనుగురించి చాలా అలజడి బయలుదేరింది. కొంత విచారణ కూడా జరిగింది. కాని రోజులు మంచివి కాకపోవటంవల్ల, నేరం ఎలా జరిగిందో నిర్ధారణచెయ్యటానికీ, నేరస్థుణ్ణి పట్టుకొని దండించటానికీ వీలులేకపోయింది.

తరువాత సోమశర్మ రామసింగుతో కలిసి ఆలోచించి, జరిగిన విషయాలన్నీ విపులంగా ఒక ఉత్తరం రాసి విజయవర్మ చేతికి ఇచ్చాడు.

క్రొత్తగా తను ప్రోగుచేసిన సైనికులను వెంటబెట్టుకుని విజయవర్మను భీమవర్మ గారి వద్దకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. చెప్పవలసిందంతా ఐనతరువాత విజయవర్మ ఉత్తరం మొలలో దోపుకొని తన దళంతో పాటు రామనగర్ బయలుదేరాడు.

(ఇంకా వుంది)






[ గిరికోటఅధిపతి భీమవర్మతండ్రినిచంపి కొడుకును పెంచాడు. యుద్ధానికివెళ్ళి సైనికులకొరకు కబురంపగా వున్నసైన్యమంతా తరలిపోయింది. ఈలోపు ఇక్కడ గుప్తశత్రువులుతలెత్తి అతని బంటునొకనిని బలిగొన్నారు. ముందు చదవండి-]

భీమవర్మా, అతని సైనికులూ, ఆరాత్రి రాంనగర్‌లో హాయిగా నిదురపోయారు. వేకువజామునే లేచి భీమవర్మ తన వ్యవహారాలు చూచుకొనసాగాడు. అతడు చాలా కరుకుమనిషి. నయానో, భయానో, పని నెరవేర్చుకపోవటం అతనికి పరిపాటి.

ఆరోజు ఉదయం విజయవర్మ, సైనికులతో రాంనగర్ చేరుకొనేటప్పటికి భీమవర్మ తన విడిదిలోని ఒక గదిలో కూర్చొని ఉన్నాడు. ఆ గదిలో పన్నెండేళ్లవాడిలా కనపడే ఒక కుర్రవాడుకూడా ఉన్నాడు.

ఇంతలోనే విజయవర్మ గుర్రం దిగి హడావుడిగా ప్రవేశించాడు. భీమవర్మ తలెత్తిచూసి 'విజయా! నువ్వెలా వచ్చావు? రామసింగు ఏమయ్యాడు?' అని అడిగాడు. విజయవర్మ నమస్కరించి, లేఖ తీసిఇచ్చి 'ఇది చదువుకోండి. అంతా మీకే తెలుస్తుంది' అన్నాడు. ఆ లేఖ చదివేసరికల్లా భీమవర్మ ముఖం కోపంతో ఎర్రబారింది. 'ఏదో పాటనుగురించి వ్రాసిఉంది దీనిలో. అది నీవుకూడా చదివావా ?' అని విజయవర్మను అడిగాడు. విజయవర్మ తలఊపాడు.

'దాంట్లో మీ తండ్రిని సోమశర్మ చంపినట్టో ఏదో రాసిఉందటగా ?' అన్నాడు భీమవర్మ. 'నేనే పాపం ఎరుగనన్నాడు సోమశర్మగారు' అని బదులు చెప్పాడు




విజయవర్మ. 'అలాగా, సరే, నేను తీరికగా ఈ విషయాలన్నీ చెబుతాలే నీకు ఎపుడో ఒక సారి. అప్పుడు చండీదాసు చంపాడని అనుకొన్నారు జనులంతా. ఐతే కాలం కలిసి రాలేదు. అందువల్ల ఏమీ చేయటానికి వీలు లేకపోయింది. సరే, నేనొక లేఖ రాసి ఇస్తాను. చలిది గుడిచి, నీవు అది తీసికొని వెంటనే తిరిగిపో." అన్నాడు భీమవర్మ.

అప్పుడు విజయవర్మ 'లేఖ ఇంకెవరి చేతికన్నా ఇచ్చి పంపించండి. నన్నుకూడా మీవెంట యుద్ధానికి రానివ్వం'డని అన్నాడు.

కాని భీమవర్మ ఇందుకు ఒప్పుకోలేదు. ఆయన ఉత్తరం రాసేలోపుగా విజయవర్మ చలిది తినసాగాడు. ఇంతలో అతని చేతినెవరో తాకినట్టనిపించింది. ఒక లేత గొంతుక అతని చెవిలో గుసగుసలాడింది: 'తూరుపుకొండకు త్రోవ చెబుతావా అబ్బాయీ!' అని. 'గిరికోట త్రోవనే వెళ్ళు. ఏటిని చేరుకొంటావు. అక్కడ కనుక్కుంటే తెలుస్తుంది.' విజయవర్మకూడా మెల్లగా సమాధానం చెప్పాడు. ఇదంతా తృటిలో జరిగిపోయింది. విజయవర్మ మళ్ళీ తలెత్తి చూచేటప్పటికి ఇంతసేపటినుంచీ గదిలో కూర్చొనిఉన్న కుర్రవాడు లేడు.

'ఆ కుర్రకుంకా నన్ను 'అబ్బాయీ!' అని పిలిచింది. సరే, వీడిపని పట్టకపోతా నటలే' అనుకొన్నాడు విజయవర్మ.


కొంతసేపటికి లేఖ వ్రాసి ఇచ్చాడు భీమవర్మ. అది తీసికొని విజయవర్మ గిరికోటకు మరలాడు. అతనలా వెళ్ళాడో లేదో, కోసల్యారు సామంతులలో ఒకడైనటువంటి చంద్రదుర్గాధిపతినుంచి భీమవర్మవద్దకు ఒకదూత వచ్చి, ఉదయంనుంచే యుద్ధం మొదలయ్యిందనీ, భీమవర్మ సాయం అత్యవసరమనీ చెప్పాడు.

కాని భీమవర్మ అతను చెప్పింది వినే స్థితిలో లేడు. 'కరుణ ఎక్కడకు

పోయింది? ఏదీ, ఆ అమ్మాయి ఏదీ?' అని అరుస్తున్నాడు. ఇది విని ఒకడు 'ఏ అమ్మాయండీ? ఇక్కడ అమ్మాయి లెవరూ లేనిదే?' అన్నాడు. 'ఇప్పటిదాకా నావెంట ఒక కుర్రాడు లేడూ? అతనేరా మూర్ఖుడా!' అన్నాడు భీమవర్మ. 'సరే, అతన్ని మీరు 'కరుణాకరా!' అని పిలచారే. అతను ఒక అరగంటముందే గుర్రమెక్కి వెళ్ళాడు' అన్నాడు నారాయణ అనేఅతను.


'అయితే నిలబడి చూస్తారేం? నారాయణా! నీవు సైనికులను తీసుకుని ఆ అమ్మాయిని వెంబడించి పట్టుకో. తీసుకెళ్ళి గిరికోటలో ఉంచు. లేకపోతే నీకు తెలుసుగా?' అని గర్జించాడు భీమవర్మ. వెంటనే నారాయణ ఒక ఆరుగురు సైనికులను తీసుకొని కరుణాకరుణ్ణి వెంబడించసాగాడు.

ముందుబయలుదేరినవిజయవర్మ గిరికోట వద్దనున్న ఊబి సమీపించేసరికి తొడలవరకు కూరుకుపోయిన ఒక గుర్రం కనుపించింది. రౌతుకూడా దగ్గరలోనే ఎక్కడో ఉంటాడని అనుకొంటూవుండగానే అతనికొక కుర్రవాడు కనుపించాడు. తాను భీమవర్మవద్ద చలిది గుడుస్తున్నప్పుడు తూరుపుకొండకు త్రోవ అడిగిన కుర్రవాడు అతనే. ఊబిలో దిగబడి




చనిపోతున్న గుర్రం అతనిదేనని వెంటనే గ్రహించి విజయవర్మ అతన్ని తనవెంట రమ్మన్నాడు. అతనినికూడా తనగుర్రంమీద కూర్చొపెట్టుకున్నాడు.

ఇలా కొంతదూరం వెళ్ళినతరువాత 'నీ పేరేమిటయ్యా,' అని అడిగాడు. 'నాపేరు కరుణాకరు'డని ఆ కుర్రవాడు బదులు చెప్పాడు. 'భీమవర్మ నీకేమౌతాడు?' 'నాకేమీ కాడు. తన స్వార్థంకోసం బలవంతాన నన్ను బంధించాలని చూశాడు. అతని చేతికి చిక్కానంటే నాకు మూడిందన్నమాటే. అందుకనే తూరుపుకొండకు పోతున్నా నబ్బాయీ!' అన్నాడా కుర్రవాడు.




'మళ్ళీ 'అబ్బాయీ!' అంటావు? నీకేమి బుద్ధిఉందా, లేదా? నేను నీకంటే చిన్న వాడినా? ఐనా నీవు భీమవర్మవద్దనుంచి పారిపోతున్నావు. నీకు సాయంచేసినట్టు ఆయనకు తెలిసిందా, నాక్కూడా మూడు తుంది. లేనిపోని గొడవ నాకెందుకు?' అన్నాడు విజయవర్మ. ఇది విని ఆ కుర్రవాడు అతనిని దీనంగా వేడుకొన సాగాడు.

విజయవర్మకు జాలివేసి 'నీకేమీ భయం లేదు. నీప్రాణానికి నాప్రాణం అడ్డువేస్తా' నని చెప్పి అభయమిచ్చాడు. అతను అలా పలికాడోలేదో, వెనుకనుంచి వారికి స్పష్టంగా కేకలు వినిపించాయి. కాని అప్పటికే వారు ఇద్దరూ రేవువద్దకు వచ్చేశారు.

విజయవర్మ కేకవేయగానే పడవవాడు వచ్చాడు. కరుణాకరుణ్ణిచూచి 'ఇతనెవ'రని అడిగాడు. 'నాచుట్ట'మని విజయవర్మ చెప్పగా, ఒక్కసారి ఎగాదిగా చూచి నవ్వ సాగాడు. కాని విజయవర్మ కోపపడే టప్పటికి బలవంతాన నవ్వు ఆపుకొన్నాడు.

ఐతే, ఆ పడవవాడు విజయవర్మను మామూలు రేవులో దించలేదు. ఇది విజయ వర్మకు వింత గొలిపింది. కారణం అడిగే టప్పటికి పడవవాడు సైగచేశాడు. ఎదురుగా ఉన్న ఒక చెట్టుకొమ్మలపైన బాణం ఎక్కు పెట్టి గురిచూస్తున్నమనిషి 'ఎవరా వస్తున్న' దని కేకవేశాడు.

'ఎవరైతే నీకేం?' అని విజయవర్మ తిరుగుకేక పెట్టాడు. 'ఇతడు విజయవర్మ. మరెవరో కాద'ని పడవవాడు కేకపెట్టేలోపలే బాణం రయ్యిన వచ్చి విజయవర్మ గుర్రం గుండెల్లో నాటింది. ఈసందట్లో కరుణా కరుడు ముందే దూకి గట్టెక్కాడు. కాని విజయవర్మకూడా దూకేలోపలే గుర్రం పడిపోవటం, పడవ తల్లక్రిందులై విజయ వర్మ నీటిలో పడటం జరిగింది.

ఎలాగో తిప్పలుపడి విజయవర్మ ఒడ్డెక్కిందాకా కరుణాకరుడు పాపం, కదలలేదు. అక్కడ అడవి దట్టంగా ఉంది. ఇద్దరూ ఒక్క క్షణమైనా ఆగకుండా పరుగెత్తారు. కాని కొద్దిసేపట్లోనే కరుణాకరుడు అలిసిపోయి కుంటసాగాడు.

అప్పుడు విజయవర్మ కరుణాకరుడికి ఊతమిచ్చి నడిపించాడు. కొంతదూరం వెళ్ళినతరువాత విజయవర్మ చటుక్కున ఆగి అన్నాడు : "నిన్నుచూచి పడవవాడు ఎందుకు నవ్వాపుకోలేకపోయాడో నాకిప్పుడు అర్థమౌతున్నది. నీవిలా బక్కగా, బలహీనంగా, సుకుమారంగా ఉండటంచూచి ఆడపిల్లవనుకున్నాడు." "లేదు, లేదు" అన్నాడు కరుణాకరుడు సిగ్గుపడుతూ. 'అలాఅనకు. నిన్నుచూసి ఎవరైనా ఆడపిల్లవనే అనుకొంటారు. అతని తప్పేమీ లేదు!' అన్నాడు విజయవర్మ.


ఇలా కొంతదూరం వెళ్ళేసరికి ఒక లేడి వారి ఎదుటినించి పరుగులిడుతూవచ్చి రివ్వున దూసుకపోయింది. ఇంతవరకూ విజయవర్మా, కరుణాకరుడూ తాపీగానే నడుస్తున్నారు. కాని ఇది చూడగానే విజయవర్మకు అనుమానంతట్టింది. ఒక పొడుగాటి




చెట్టు ఎక్కి చూచేటప్పటికి ఏటికి ఇవతల ఒడ్డున ఏదో కదులుతున్నట్టు కనుపించింది.

అనుమానం రూఢిఅయింది. ఇద్దరూ మళ్ళీ ముందుకు సాగి కొంతదూరం పోయి, గిరికోట అరణ్యంలో అవతల కొస చేరుకోబోయారు. ఇంతలో ఏదో అలికిడి అయింది. విజయవర్మ వెంటనే ఒక చెట్టు చాటున దాగాడు. కరుణాకరుడి కిది ఎంత మాత్రం అర్థంకాలేదు.

'హుష్!' అని విజయవర్మ వేలితో సైగ చేశాడు. వారికొక వందగజాల దూరంలో ఒక చెట్టుమీద ధనుర్బాణాలు చేపట్టివున్న ఒకమనిషి నిలచి, నలుదిక్కులా




పరికిస్తున్నాడు. 'ఎడంప్రక్కగా తప్పుకొని పోదాం పద' అన్నాడు విజయవర్మ. వారలా కొంతదూరం వెళ్ళారు. ఆ ప్రదేశమంతా విజయవర్మకుకూడా క్రొత్తగాఉంది. అందువల్ల జాగ్రతగా ముందుకు సాగుతున్నారు.

ఇంతలో ఒక గొంతుక ఏదో పాట ఎత్తుకుంది. ఇద్దరూ ఆగిపోయారు. చూస్తే వారికి ఎదురుగా ఒక కందకం ఉంది. పక్కనే పాడుబడిన కట్టడం ఒకటి ఉంది. అక్కడే ఒక పొయ్యికూడా రాజుతూఉంది. దొంగల వేషంలోవున్న ఒక మనిషి పొయివద్ద కూర్చొని ఏదో పాడుతున్నాడు. ఇంకా ఒకరిద్దరు దగ్గరలోనే పండుకొని ఉన్నారు. వంట అయినట్టుంది. వంటచేస్తున్న మనిషి ఈల వేయగానే చుట్టుపక్కల ఎక్కడినించి వచ్చారో, మరి ఒక ముప్పయి నలభైమంది బిలబిలలాడుతూ పళ్ళాలు పట్టుకొని వచ్చారు.

వారందరూ కూచున్నతరువాత రాజసం ఉట్టిపడుతున్న ఒక మనిషి వచ్చి కూర్చున్నాడు. వైఖరినిబట్టి చూస్తే అతడే వారి నాయకుడిలా కనుపించాడు. 'అబ్బాయిలూ, త్వరగా కానివ్వండి. త్వరగా వడ్డించు ధనపాల్! చిన్నపని ఒకటిఉంది చేయువలసింది' అన్నాడు ఆవ్యక్తి. భోజనాలైపోయేటంతలో ఒక బాణం రివ్వున వచ్చి పాడుబడిన కట్టడపు గోడకు తగిలి ముక్కలు ముక్కలై క్రిందపడింది. ఇది ముందే అనుకొనిన సంజ్ఞకామోసు. ఎందుకంటే ఇది చూచినవెంటనే ఎక్కడివాళ్ళక్కడ చేతులు కడుక్కొని లేచారు. నాయకుడు అందరికంటే ముందే ధనుర్బాణాలు చేపట్టి అన్నాడు—

'అబ్బాయిలూ! భీమవర్మో, లేక అతని బంటులో మరికొందరు చిక్కారు. జ్ఞాపకముంచుకోండి. దిక్కులేక చచ్చిన అభయవర్మ ఒక్కడిదే కాదు. ఇంకా



ఎంతమందిదో మనం పగతీర్చుకోవాలి.' ఇలా అనేసరికి, అడవిలో ఎక్కడివాళ్లక్కడ మాయమయ్యారు. విజయవర్మకూ, కరుణాకరుడికీ వ్యవధి చిక్కింది. 'మనం పోదాం' అన్నాడు కరుణాకరుడు.

'బలేవాడివయ్యా!' అన్నాడు విజయవర్మ.

'భీమవర్మ సైనికులను నీవు రక్షిస్తావా? దొంగలనాయకుడన్నది వినలేదా? అభయవర్మ ఎవరు? నీ తండ్రికాదా?' అన్నాడు కరుణాకరుడు. 'దొంగలమాటలా నమ్మటం?' అంటూ విజయవర్మ వెనుదిరుగాడు. కరుణాకరుడూ వెంబడించాడు.

చాలాదూరంలో విజయవర్మకు నారాయణా, అతని జట్టువారూ గుర్రాల మీద కనుపించారు. వారు తెరిపిగా ఉన్న చోటికి వచ్చేసరికి నాలుగువైపులనుంచీ బాణాలవర్షం కురియసాగింది. వారు ఉక్కిరిబిక్కిరయారు.

శత్రువెక్కడా కనపడడు. బాణాలు మాత్రం మిత్తవలావచ్చి ప్రాణాలు హరించుకపోతున్నయి. నిముసంలో కథ ముగిసిపోయింది. నారాయణ ఒక్కడే మిగిలాడు. ఒక్కసారి నలుదిక్కులా పరికించి అతడు పరుగు లంకించుకొన్నాడు.

అతని చర్యలన్నీ కనిపెడుతున్న శత్రువులు పొట్టలు చెక్కలయ్యేట్టు నవ్వారు. నారాయణకు కోపంవచ్చి గ్రుడ్డిగా ఒకబాణం అడవిలోకి వదిలాడు. అదృష్టవశాత్తు అది ఎవరికో తగిలి, ఒకకేక వినవచ్చింది.

వెంటనే బాణాలవర్షం కురియసాగింది. పారిపోతున్న నారాయణ ప్రాణం దక్కించుకోవాలని చూశాడు. తప్పించుకొంటాడో లేదో అని విజయవర్మా, కరుణాకరుడూ రెప్ప వాల్చకుండా చూస్తున్నారు.

ఇంతలో ఒక బాణంవచ్చి గుండెలో గుచ్చుకొని నారాయణ పడిపోయాడు. విజయవర్మ అతనివద్దకు పరుగెత్తాడు. కాని

'అభయవర్మ కొడుకుని చంపవద్దని చండీదాసు ఆజ్ఞ' అని ఎవరో వేసిన కేక విజయవర్మ ప్రాణాలను రక్షించింది.


అతనూ కరుణాకరుడూ పరుగెత్తారు. సద్దు మణిగినదాకా ఎక్కడా ఆగలేదు. తిరిగి బయలుదేరుదా మనుకొనేటంతలో పారిపోతూవున్న గుంపులు కనుపించినై. దీనినిబట్టి యుద్ధంలో కోసల్వారు వోడిపోయినట్టు గ్రహించాడు విజయవర్మ. మరి భీమవర్మ ఏమైనట్టు?

ఇంతలో వారికి 'డబుకుడబుడుక్కు' అనేశబ్దం వినిపించింది. ఉన్నకొద్దీ ఆ శబ్దం దగ్గరగా రాసాగింది. బుడబుక్కలవాడు వచ్చాడు. వానిని చూడగానే కరుణాకరుడు ఒక్క కేకతో స్పృహతప్పి పడిపోయాడు. విజయవర్మా గాబరాపడ్డాడు. అతనెవరో కాదు, భీమవర్మే. 'ఏం విజయా! మంచి స్నేహితుణ్ణి సంపాదించావే? అతని పేరన్నా తెలుసా నీకు' అన్నాడు బుడబుక్కలవేషంలో వున్న భీమవర్మ విజయునితో. 'ఇతని పేరు కరుణాకరుడు గదండీ! మీరీవేషంలో ఉన్నారేమండీ!' అన్నాడు విజయవర్మ. ఇది విని భీమవర్మకు కోపం వచ్చింది. 'ఏం చేసేది, మన పక్షం ఓడిపోయింది. మనవాళ్లంతా ఏమయ్యారు? ఇతనెక్కడ కలిశాడు నీకు?' అన్నాడు.

'త్రోవలో కలిశాడు. నారాయణ వాళ్లు...' అని అంటుండగానే, 'ఏరి వాళ్లంతా?' అని అడిగాడు భీమవర్మ. విజయవర్మ భయపడుతూ, జరిగినదంతా చెప్పాడు. భీమవర్మ మండిపడి, 'ఐతే, నేను గిరికోట చేరుకుంటాను. నీవు నీ స్నేహితుణ్ణికూడా వెంటతీసుకొని రా' అని చెప్పి, విజయవర్మ చేత ఒట్టువేయించుకుని వెళ్ళిపోయాడు.

వాగ్దానంప్రకారం విజయవర్మ కరుణాకరుణ్ణి వెంటబెట్టుకొని గిరికోటకు తీసుకెళ్లక తప్పలేదు. వారికోసం భీమవర్మ అక్కడ సిద్ధంగా వేచివున్నాడు. —(ఇంకా వుంది)






లేఖతో సహా భీమవర్మవద్దకు వెళ్లిన విజయవర్మ తిరిగివస్తూ, త్రోవలో పురుషరూపంలో పారిపోతున్న కరుణను కలుసుకొన్నాడు. యుద్ధంలో భీమవర్మ పక్షం ఓడిపోయింది. భీమవర్మ మారు వేషంతో ప్రాణాలు దక్కించుకొని పారిపోయాడు. అక్కడ శత్రువులు పెచ్చరిల్లుతారు. భీమవర్మ ఆజ్ఞప్రకారం విజయవర్మ కరుణను గిరికోట చేరుస్తాడు. ఇక—

గిరికోట తిరిగివెళ్లిన విజయవర్మకు అక్కడి జనమంతా చాలా నిస్పృహగా కనిపించారు. యుద్ధంలో ఓడిపోవటం, పైపెచ్చు శబ్దవేధి దుండగాలూ! కోటలో ప్రవేశించిన కరుణాకరుడు మరి కనబడలేదు. తన తండ్రి చావునుగురించి అతను అన్న మాటలు విజయవర్మ మనసులో మెదులుతూనే ఉన్నాయి. ఏమీ తోచక అతను రాంసింగును అడిగాడు. రాంసింగు ఒక్క క్షణం అతనివంక తీవ్రంగా చూచి—'నాకీ విషయాలు తెలియవు. నీవూ ఇలాంటి విషయాలు పట్టించుకొనకపోవటమే మంచిది. కాదంటావా సోమశర్మగారిని అడుగు' అన్నాడు. మారుమాటాడకుండా విజయవర్మ వెళ్లిపోయాడు.

భీమవర్మ తన సైనికులకు ధైర్యంచెప్పి బీసల్పూరు సామంతులలో ఒకడైన దేవదుర్గాధిపతికి ఒకలేఖ పంపించాడు. అతడీ విధంగా రంగుమార్చటం ఎవరికీ ఆశ్చర్యం కొలపలేదు. అతని కిది అలవాటే.

విజయవర్మ తిన్నగా సోమశర్మగారి వద్దకు వెళ్లి రాంసింగును అడిగిన ప్రశ్న మళ్ళీ అడిగాడు. సోమశర్మ 'ఇదివరకొకసారి చెప్పలేదా' అనేసి వెళ్ళిపోయాడు.




విజయవర్మకు తృప్తి కలగలేదు. 'ఈ విషయం ఇంకెవ్వరిని అడుగుదామా' అనుకొనేటంతలో భీమవర్మగారు పిలుస్తున్నారని చెప్పాడు ఒక సేవకుడు.

విజయవర్మ వెళ్ళేటప్పటికి భీమవర్మ తన గదిలో కోపంగా పచారుచేస్తున్నాడు. పక్కన సోమశర్మ తప్ప మరెవ్వరూ లేరు. వెంటనే విజయవర్మ తనకు పిలుపు ఎందుకు వచ్చిందో గ్రహించగలిగాడు. 'నన్ను పిలిచారా?' అన్నాడు మెల్లగా.

"ఔను, కనపడ్డవారినందరినీ నీవు యేవేవో ప్రశ్నలు వేస్తున్నావటగదా? నిన్ను పెంచి పెద్దవాణ్ణి చేసినందుకు ఇదేనా ప్రతిఫలం? నీకేం లోటు చేశాను? కన్నకొడుకు కంటే ఎక్కువగా చూసుకొంటున్నానే!" అని కస్సుమంటూ లేచాడు భీమవర్మ.

"ఇవన్నీ మర్చిపోయేటంత కృతఘ్నుణ్ణి కాను నేను. కాని నా తండ్రిచావుగురించి రకరకాల గాలికబురులు వినవస్తున్నయ్. సత్యమేమిటో తెలుసుకొనేవరకు నాకు స్థిమితం చిక్కదు" అని విజయవర్మ గట్టిగా సమాధాన మిచ్చాడు.

'అయితే విను: భగవంతుని సాక్షిగా చెబుతున్నాను. మీ తండ్రిచావుతో నాకెట్టి ప్రమేయం లేదు. నా మాట నమ్మకముంటే అనుమానం రద్దుచేసుకో. లేదా, కోటబయట అరణ్యంలో నా శత్రువులెంతమందో ఉన్నారు. నీవుకూడా వారిలో కలిసిపో' అని భీమవర్మ ఒట్టువేసుకునేసరికి విజయవర్మకు పూర్తిగా సంతృప్తి కలిగింది. అతను సంతోషంగా సోమశర్మవైపు తిరిగాడు.

కాని, సోమశర్మముఖం చూచి అతనికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. అతని ముఖంమీద కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. భయంతో నిలువునా వణికిపోతున్నాడు. విజయవర్మ మళ్ళీ అనుమానంతో 'సోమశర్మగారుకూడా ఒట్టువేసుకుంటే!' అన్నాడు.

"ఎందుకు వేసుకోడు? నేరం చెయ్యని వాడికేం భయం? వేసుకోవయ్యా ఒట్టు!' అన్నాడు భీమవర్మ. కాని సోమశర్మ నోటివెంట మాట రాలేదు. భీతితో అతడు భీమవర్మవైపే చూస్తున్నాడు.

ఇంతలో ఆ గదికిటికీలోంచి ఒక బాణం రివ్వుమంటూ వచ్చి, ఆ ముగ్గురి కెదురుగా వున్న గోడలో గ్రుచ్చుకొని జవజవలాడింది. అది శబ్దవేధిబాణమని ఆ ముగ్గురూ చూడగానే తెలుసుకున్నారు. సోమశర్మ ఒక పిచ్చికేకవేసి వెనక్కు పడిపోయాడు. భీమవర్మ, విజయవర్మలు పరుగెత్తుకొని కిటికీ వద్దకువెళ్లి తొంగిచూశారు. కాని ఏవిధమైన అలజడీ కనుపించలేదు. దూరంగా చెట్లమీద పక్షులు ప్రశాంతంగా ఎగురుతున్నవి.

భవనద్వారంవద్ద యథావిధిగా కాపలా కాస్తూనే ఉన్నారు. 'సరే, విజయా! ఇక నీవు వెళ్ళు. సోమశర్మ ఒట్టువేసుకోక ఎక్కడకు పోతాడో చూస్తాను. నీవూ కొంచెం కనిపెట్టి ఉండు, ఎందుకైనా మంచిది' అని భీమవర్మ విజయుణ్ణి పంపివేశాడు.

అప్పుడే తేరుకొంటున్న సోమశర్మ వైపు తిరిగాడు. 'నీమూలాన అతనికి మళ్ళీ అనుమానంవేసింది. ఈరాత్రికి నీవు




కూడా ఒట్టుపెట్టుకొంటే అతని ప్రాణాలు రక్షించినవాడివౌతావు. లేదా, అతడుకూడా తన తండ్రితోవే పట్టవలసివస్తుంది. ఇదిగో, వెంటనే అతణ్ణి పడమటి గదిలోకి మార్చు'.

'పడమటిగదిలోకా?' అన్నాడు సోమశర్మ బొంగురుగొంతుకతో.

"ఔను, అతని చావుబ్రతుకులు నీ చేతుల్లో వున్నాయి. ఒట్టుపెట్టుకొని యేదో విధంగా మైదుపుచ్చావా, అతను బ్రతికిపోతాడు. లేదా, తండ్రితోపాటు కొడుకును చంపిన పాపంకూడా నీ తలకు చుట్టుకుంటుంది. ఏమంటావు?" అన్నాడు భీమవర్మ. క్షణమాత్రం ఉండి సోమశర్మ




'లేదండి. అతని ప్రాణాలు రక్షించటానికి బొంకనైనాబొంకుతాను' అన్నాడు. 'ప్రక్క గదిలోనే ఉంటా. అతని అనుమానం నిర్మూలం చెయ్యి' అని భీమవర్మ వెళ్లి పోయాడు.

మరికొంతసేపటికి విజయవర్మ ఆ గదిలో ప్రవేశించాడు. పాపం సోమశర్మ ముఖం పాలిపోయివుంది. తలెత్తిచూసి విజయవర్మ చేయిపట్టుకొని 'నేనుకూడా ఒట్టుపెట్టుకొంటే నీకు సంతృప్తి కలుగుతుందిగా? భగవంతుని సాక్షిగా చెబుతున్నాను. నీ తండ్రిచావుతో నాకెట్టి ప్రమేయం లేదు' అని నిష్కర్షగా చెప్పాడు.

అప్పుడు విజయవర్మ 'సరే. మరి ప్రమేయ మెవరికుందో మీకు తెలుసా?' అని అడిగాడు. సోమశర్మ తొట్రుపడి 'లేదు, లేదు. నాకేమీ తెలియదు' అంటూ వెళ్ళిపోయాడు.

నిర్దోషినని ఒట్టుపెట్టుకొన్న సోమశర్మ ఇలా తత్తరబోయి హఠాత్తుగా వెళ్ళిపోవటం విజయవర్మకు ఆశ్చర్యం కలిగించింది. నలువైపులా కలియజూచాడు. ఎదురుగా వున్న గది కిటికీలు కదిలినట్టనిపించింది. ఎవరిదో ఒక కన్ను క్షణమాత్రం తళుక్కుమని తొలగిపోయింది.

జరిగిన సంభాషణ అంతా ఎవరో పొంచి విన్నారన్నసంగతి విజయవర్మకు రూఢి అయింది. ఇదంతా ఒక మాయనాటకమన్న సంగతి తెలిసిపోయింది. 'నేను సాలీని వలలో చిక్కుకొన్నాను' అనుకొన్నాడు. వెంటనే కరుణాకరుడు స్ఫురణకు వచ్చాడు. 'పాపం, నామూలాన అతడు కూడా వలలో చిక్కుకొన్నాడే' అని విచారించాడు.

విజయవర్మ గదిలోనించి బయటకు రాగానే ఒక దూత వచ్చి అతని ఉనికి మరో క్రొత్తగదిలోకి మార్చబడింది అని చెప్పాడు. 'ఎందువల్ల? ఏగది?' అని అడిగాడు

విజయవర్మ. 'పడమటిగదిలోకి' అనిబదులు చెప్పాడు దూత. 'ఎలాంటి గది? బాగుంటుందా?' అన్నాడు విజయవర్మ. 'గదికేం, భేషుగ్గానే వుంటుంది, దెయ్యాలున్నయ్యన్న మాటకాని' అన్నాడు దూత. శంకాకుల చిత్తంతో విజయవర్మ తన క్రొత్త నివాసం వైపు తరలాడు.

ఆ గదిఎత్తు తక్కువగా, విశాలంగా, చీకటిగా ఉంది. దానిలో పందిరిమంచం మహారాజులు పడుకొని నిద్రించేదానిలాగా ఉంది. ఒకప్పుడు ఎవరో గొప్పవారున్న గది. ఇది అంతా చూడగా విజయవర్మ అనుమానం ఇంకా ఎక్కువయింది. అతడు గోడలు, అలమారులు అన్నీ తట్టి, పరీక్షించి చూచాడు. కాని ఎక్కడా విశేషమేమీ గోచరించలేదు. అయితే గుప్తద్వారం ఎక్కడ? ఎక్కడో ఒకచోట ఉండితీరాలే?

రానురాను అనుమానాలింకా ఎక్కువయాయి. ఇటువంటిచోట కన్నుమూయడం ప్రమాదమనుకున్నాడు.

ఇంతలో అతనికి గదితలుపులెవరో గోకుతున్నట్టు విన్పించింది, దగ్గరకు వెళ్ళి చెవి ఒగ్గి విన్నాడు. ఎవరో మెల్లగా తలుపు తీయమంటున్నారు. కంఠం గుర్తుపట్టి విజయవర్మ వెంటనే తలుపుతీశాడు. ఒక




చేతిలో చురకత్తి పట్టుకొని కరుణాకరుడు లోన ప్రవేశించాడు. 'ఏం' జరిగింది? కోటలో ప్రవేశించాక మళ్ళీ కనిపించలేదేం?' అని ఆత్రంగా ప్రశ్నలువేశాడు విజయవర్మ.

"ఏంజరిగితేనేం, మనం మళ్ళీ ఇక్కడ కలుసుకున్నాం. నీవు మట్టుకు త్వరగా పారిపో. తెల్లవారితే ప్రాణాలు దక్కవు. వాళ్ళు గుసగుసలాడుకోవటం నేను చెవులార విన్నాను" అన్నాడు కరుణాకరుడు. తరువాత వారిద్దరూ కలసి గుప్తద్వారం కోసం మళ్ళీ వెతకటం ప్రారంభించారు. ఇంతలో గదిబయట అడుగుల చప్పుడు వినిపించింది.



దీపం ఆర్పేసి వారిద్దరూ చీకటిలో దాక్కొనికూచున్నారు. గదికొకమూల వారు గోడ అనుకొన్నచోట చెక్కలు తొలగి కొంచెం వెలుతురు లోనికి చొరబడింది. విజయుడూ కరుణాకరుడూ ఊపిరి బిగపట్టుకుని యిది చూస్తూనేవున్నారు.

ఇంతలో భవనం వెలుపల కేకలూ, అరుపులూ వినిపించాయి. తక్షణమే గుప్త ద్వారం మూసుకుంది. 'హంతకుడు' ఇది అదను కాదని వెళ్లిపోయాడు.

బయట అరుపు లిప్పుడు స్పష్టంగా విన వస్తున్నాయి. 'కరుణ ఏది? వెతకండి! వెదకండి!' అంటున్నారెవరో!

'కరుణ ఎవరబ్బా! కరుణాకరా! పొరపాటున నిన్ను ఆడపిల్ల వనుకోవటం లేదుగదా వాళ్ళందరూ!' అన్నాడు విజయవర్మ.

"మొదటికే ముప్పు వచ్చిందిప్పుడు. నన్ను పట్టుకున్నదాకా ఊరుకోరు వాళ్ళు. తలుపు తెరచి నన్ను పోనివ్వు విజయా! వాళ్లు నన్ను పట్టుకొని సంబరపడుతుంటే నీవు తప్పించుకు పోవచ్చు" అని సలహా చెప్పాడు కరుణాకరుడు.

అప్పుడు అర్థమయింది విజయవర్మకు. పరిస్థితి అంతా.

"నీవు కరుణాకరుడివి కాదు. నీవే కరుణవు" అని అరిచాడు. కరుణ మారు మాటాడకుండా నిలుచుంది.

'కరుణా! మించిపోయిందిలేదు. బ్రతికి బాగుంటే మనిద్దరికిక ఎడబాటు ఉండదు. చావే తప్పకపోతే ఇద్దరం ఒకేసారి చద్దాం' అన్నాడు విజయుడు.

కాని అంతలో అతని మాటలు కాదన టానికే అన్నట్టుగా బయట అడుగుల సందడి వినిపించింది. అంతేకాదు, ఎవరో బలంగా తలుపు గుద్దిన ధ్వని అయింది. పైగా మరునిముసంలోనే భీమవర్మ కంఠం వినిపించింది. 'తలుపు తెరుపు విజయా!

లోపల ఎవరున్నదీ మాకుతెలుసు. వెర్రి వేషాలు వేయకు' అన్నాడాయన. వెంటనే విజయవర్మా, కరుణాకరుడూ గుప్తద్వారం కేసి పరుగులెత్తారు. వారు బయటపడేసరికి భీమవర్మ భటుల తాపులకు గదితలుపులు బ్రద్దలయినై.

గుప్తద్వారానికి అవల ఇరుకుగా, చీకటిగా వున్న ఒకత్రోవవెంబడే వెళ్ళగా వారొక రహస్య కక్ష్యాన్ని చేరుకొన్నారు. మరి ముందు త్రోవ లేక, అక్కడే ఆగిపోయారు.

ఆ ప్రమాదసమయంలో కరుణ విజయవర్మకు తన కథంతా చెప్పింది. తానొక జమీందారు కూతురుననీ, అనాథురాలు కావడంవల్ల చిన్నప్పటినుంచీ చంద్రదుర్గాధిపతియింట పెరిగాననీ, ద్రోహబుద్ధి గల భీమవర్మ తనను బలిమినిపట్టి తెప్పించి పురుషవేషం ధరింపచేశాడని కూడా చెప్పింది.

ఆ కథఅంతా వినగానే విజయవర్మకు చాలా జాలివేసింది. 'బొందిలో ప్రాణం వుండగా, ఇక నిన్ను వీడను' అని ప్రతిన చేశాడు.

అంతలో మళ్ళీ అడుగుల సందడి వినిపించింది. తిరిగిచూస్తే రాంసింగు. 'అహ! ఉన్నారు ఇక్కడే. ఇంకేం, అను



కొన్నంతపనీ జరిగింది' అన్నాడు అతను. విజయవర్మ నిశ్శబ్దంగా చురకత్తి ఎత్తాడు.

'ఆగవయ్యా! పెద్దమనిషీ! పారిపోవడానికి త్రోవ కనబడలేదా? నే చూపిస్తాను!' అన్నాడు రాంసింగు. విజయవర్మకు అప్పుడు అర్థమయింది రాంసింగు తమ మిత్రుడేనని; రాంసింగు వారికి ఇంతకు ముందే భీమవర్మదూత పోయిన రహస్య ద్వారం చూపించాడు. గోడనున్న రాతి పలక తొలగించగా త్రోవ ఏర్పడింది. వెంటనే పారిపొమ్మని వారికి సలహాచెప్పి రాంసింగు అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

విజయవర్మా, కరుణా అ(తోవనే వెళ్ళి కోటగోడను చేరుకొన్నారు. అక్కడ భీమ వర్మదూత దిగిపోయిన కిటికీ వుంది. దాని చువ్వల కింకా త్రాడు వేలాడుతూనేవుంది. పరవా లేదని అనుకొన్నాడు విజయవర్మ. ఇంతలో వెనుకనుంచి కేకలు విన వచ్చాయి.


'రా, కరుణా! ఆలసిస్తే లాభం లే' దన్నాడు విజయవర్మ. కాని కరుణ కిటికీ లోంచిఆ అ గాధంలోకి తొంగిచూచి గజగజ వణకిపోయింది. భీమవర్మ భటులు రానే వచ్చారు. ఏమయితే అయిందని విజయ వర్మ కరుణను వదిలేసి త్రాడు పట్టుకొని దూకేశాడు. పైనుంచి బాణాలవర్షం కురి సింది. కాని విజయవర్మ లెక్కచేయకుండా అగడ్త ఈది అవతలకు చేరాడు. పొదల మాటున ఇక భయం లేకపోయింది.

కొంతదూరం వెళ్ళినతరువాత త్రోవలో అతనికి, శబ్దవేధి బాణానికి ఆహుతి ఐన భీమవర్మ దూతశవం కనుపించింది. తడిమిచూడగా ద్రోహిభీమవర్మవిపక్షంలో కలిసిపోతానని దేవదుర్గాధిపతికి వ్రాసిన జాబు కనబడ్డది. ఎందుకైనా మంచిదని ఆ జాబు తనవద్ద అట్టేపెట్టుకొన్నాడు విజయవర్మ.

కొంచెందూరం వెళ్లగానే అతనికి శబ్దవేధి దళంవారు కనుపించారు. ఈసారి వారివెంట నాయకునివద్దకు వెళ్లటానికి విజయవర్మ వెనుదీయలేదు. శబ్దవేధి ఐన చండీదాసు అతనిని హృదయపూర్వకంగా ఆహ్వా నించాడు. 'కరుణను వెనుక వదలి రావటం తెలివిగల పని' అని విజయుణ్ణి ఊరడించాడు.

'నీ సంగతిఅంతా తెలిసిపోయింది. ఇక చూసుకో' అంటూ విజయుడు భీమవర్మకు ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంచూచీ చూడటంతోనే భీమవర్మ పళ్ళు పటపట కొరికాడు. —(ఇంకా వుంది)






# శబ్దవేధి

[గిరికోట చేరుకొన్న విజయుడు అక్కడ తన తండ్రిచావునుగూర్చి ఆరా తీయాలని చూస్తాడు. కొనకు అతని ప్రాణాలకే ముప్పు వస్తుంది. దీనినిగూర్చి ముందే తెలుసుకొన్న కరుణ అతనిని హెచ్చరిస్తుంది. విజయవర్మ కరుణను అక్కడే వదిలి ఎలాగైతేనేం ప్రాణాలు దక్కించుకొని బయటపడుతాడు. తరువాత చదవండి—]


విజయుడు భీమవర్మ చేతులలోనించి తప్పించుకొనికూడా, నాలుగు నెలలు గడిచి పోయాయి. ఈ మూడు నాలుగు నెలల లోను విజయలక్ష్మి బీసల్పూరు, కోసల్పూరు రాజ్యాలమధ్య నాలుగైదుసారులు చేతులు మారింది. ఇప్పుడు కోసల్పూరువారిదే పైచేయిగా వుంది.

అందువల్ల భీమవర్మగారికి పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి. ఆయన కోసల్పూరు రాజ్యానికి చెందిన మరికొంతమంది సర్దారులతోసహా నర్మదా నదితీరాన వున్న దేవపూరులో మకాంచేసి వున్నాడు.

అదే దేవపూర్‌లో ఊరిబయట నుండే ఒక పాడుబడిన సత్రంలో కూర్చుని పది పన్నెండుమంది ధనుర్ధారులు తమలోతాము ఏదో మాట్లాడుకొంటున్నారు. అర్ధరాత్రి అవుతున్నది.

ఇంతలో ఒక దూత వచ్చి వారందరి మధ్య కూర్చునివున్న ఒక యువకునితో 'విజయా, భీమవర్మ నలుగురి సైనికులతో ఇప్పుడే ఎక్కడికో బయలుదేరుతున్నాడు,' అని చెప్పాడు.

వెంటనే విజయవర్మ నలుగురైదుగురు అనుచరులతో ఆ దూతను వెంబడించాడు.



ఆ దూత వారిని నర్మదాతీరాన్నే తీసుక పోతున్నాడు. కొంతదూరం వెళ్ళినతరువాత వారికి తమముందు కాగడావెలుగులో నడుస్తున్న చిన్న జట్టు ఒకటి కనుపించింది.

అది భీమవర్మ జట్టు ఐవుంటుందని వారూహించారు. ఆ జట్టు కొంత దూరంపోయి నదిఒడ్డున పొదలు గుబురుగా వున్న ఒకచోట నిలబడిపోయింది. విజయవర్మ మొదలైనవారుకూడా కొంత దగ్గరకొచ్చి పొదలచాటున పొంచి ఏమి జరుగుతుందా అని చూడసాగారు. కొంతసేపటిలో పొదల ఆవలవైపునుంచి వారికి ఇంకొక జట్టు రావటం కనుపించింది. రెండు జట్టుల నాయకులూ పరిచయం చేసుకొన్న తరువాత ఏదో మాట్లాడుకొనసాగారు.

విజయుడు నిలుచున్నచోటికి వారు ఏమి మాట్లాడుకొంటున్నదీ సరిగ్గా వినిపించలేదుగాని, మధ్యమధ్య 'కరుణ అన్ని విధాలా తగిన పిల్ల' 'శబ్దవేధి...బహిరంగంగా వీలులేదు.' అనే మాటలు వినిపించాయి. కొంతసేపటికి మాటలు ముగిసాయి. భీమవర్మ వెనుదిరిగి తన నివాసంవైపు సాగాడు. విజయవర్మ అతనిని వెంబడించాడు.

భీమవర్మ బసచేసింది నర్మదాతీరాన వున్న ఒక పురాతన భవనంలో. భవనానికి మూడువైపుల ఎత్తయిన ప్రహరీగోడలు వున్నాయి. ఒకవైపున నర్మద, ప్రహరీగోడ కన్నా మిక్కిలిగా రక్షిస్తున్నది. ఈ భవనం విజయవర్మ ఇదివరకే గుర్తుపట్టుకొని ఉన్నాడు. కాని లోపలికిమాత్రం చొరబడటానికి వీలులేకపోయింది.

ఇంతకుముందు జరిగిన సంభాషణను బట్టి విజయుడు - కరుణ ఈ భవనంలోనే ఉన్నదనీ, ఏదో బలవంతపు పెళ్ళికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఊహించాడు. అందువల్ల తరుణం మించకముందే అతడు

ఈ భవనంమీద దాడిచేసి కరుణను విడి పించక తప్పదని నిశ్చయించుకున్నాడు.

అందువల్ల అతడు భీమవర్మ, అతని అను చరులూ, లోనికి ప్రవేశించి సింహద్వారాలు మూయించిన తరువాత చుట్టుపట్ల తిరిగి తన దాడికి వీళ్లు చూచుకోసాగాడు. ఇలా చుట్టుపట్ల పరికించిచూచి, కాపలా చాలా కట్టుదిట్టంగా ఉన్నందువల్ల గోడలుదాటడం సాధ్యంకాదని, నదివైపునుంచి దాడి చేయటమే ఇంతకన్నా సులభమనీ అతడు తేల్చుకొన్నాడు. తేల్చుకొని తన అను చరులతో సత్రానికి మరలాడు.


కాని మరల కొద్దిదూరం వెళ్ళారో లేదో ఎవరో వారిని అడ్డగించారు. వీరు తప్ప కుండా భీమవర్మ అనుచరులే ననుకొన్నారు విజయుడూ అతని అనుచరులూ. ఇంకేం, కత్తులు దూసి ఆ చీకటిలో అడ్డగించినవారి మీద విరుచుకపడ్డారు. కాని ఇలా కొంత సేపు పోరు జరిగినతరువాత నువెవరంటే మీరెవరని పలుకరించుకొన్న తరువాతగాని ఉభయులకూ తమ పొరపాటు తెలిసి రాలేదు.

అప్పుడు తెలిసింది విజయునికి తను పోరింది పూర్వం కరుణను పెంచి పెద్ద దానినిగా చేసిన చంద్రదుర్గాధిపతితోనని.



ఇద్దరికీ భీమవర్మబద్ధ శత్రువే. రెండవరోజు ప్రొద్దున్నే కలుసుకొని అన్ని విషయాలూ మాట్లాడుకొందామని నిశ్చయించుకొని ఇరువురూ ఎవరిత్రోవను వారు వెళ్ళి పోయారు.

మరుసటిరోజు ప్రొద్దున నర్మదాతీరాన విజయుడు చంద్రదుర్గాధిపతిని కలుసు కొన్నాడు. ఇద్దరికీ భీమవర్మ శత్రువుకావటం మూలాన స్నేహం కలియటానికి అట్టేసేపు పట్టలేదు. విజయునియందు చంద్రదుర్గాధి పతికి మంచి అనురాగమూ విశ్వాసమూ కలిగాయి. ఇద్దరూ కలిసి కరుణను రక్షించ టానికి ఉపాయాలు ఆలోచించి చివరకు




ఆ రాత్రే నదివైపునుంచి భీమవర్మనివాసం మీద దాడిచేయటానికి నిశ్చయించుకొన్నారు. కరుణను విజయునికిచ్చి చేయటానికి తనకేమాత్రం అభ్యంతరం లేదని కూడా చంద్రదుర్గాధిపతి వాగ్దానంచేశాడు.

విజయుని అనుచరులలో పడవల పానయ్య అనే నడివయసు గలవ్యక్తి ఒకడు ఉన్నాడు. ఈ పానయ్యకు ఓడలు, పడవలు నడపటంలో చాలా అనుభవం వుంది. విజయుడు బసకు తిరిగివచ్చి అతనితో, 'ఏం పానయ్యా! రాత్రికి ఎక్కడైనాసరే పెద్ద పడవ ఒకటి దొంగిలించాలి. కొంచెం పని వుంది' అన్నాడు. 'ఓ, అదెంతపని? రేవులో వున్న పడవలన్నీ మనయ్యే' అన్నాడు పానయ్య.

రేవులో పడవలు చాలా ఉన్నాయి. వాటన్నిటిలో ఒక పడవమటుకు వీరికి బాగా ఉపకరించేలాగా వుంది. పానయ్య ఆ పడవను మనసులో గుర్తుపెట్టుకొని విజయునికి ఆ సంగతి చెప్పించాడు. చీకటి పడేటప్పటికి చంద్రదుర్గాధిపతి తన అనుచరులు ఇరవైపాతికమందితో అక్కడికి వచ్చాడు. విజయుడుకూడా తన అనుచరులను ఇరవైపాతికమందిని సిద్ధంచేసుకొన్నాడు.

ముందు ఒక ఐదారుగురు నిశ్శబ్దంగా ప్రాకి పడవ ఎక్కేశారు. ఎక్కి కాపలా కాస్తున్న ఇద్దరు మనుషుల్ని నోట్లో గుడ్డలు క్రుక్కి, కాళ్ళూ చేతులూ కట్టివేసి నిశ్శబ్దంగా ఒడ్డుకు చేర్చారు. వారిద్దరినీ ఎక్కడో దూరంగా తీసుకువెళ్ళి పడవేసి వచ్చారు. తరువాత అందరూ బిలబిలమంటూ పడవ ఎక్కేశారు. పానయ్య చుక్కాని పట్టాడు. పడవ శరవేగంతో నదీజలాన్ని చీల్చుకొంటూ ముందుకు సాగింది.

'మబ్బులుపడుతున్నాయి. లక్షణాలంత బాగా లేవు' అన్నాడు పానయ్య ఆకాశం వంక చూచి. 'ఔను, లక్షణాలు చూస్తే





తుపాను వచ్చేటట్టేవుంది. ముహూర్తం అంత మంచిది కాదేమో?' అన్నాడు చంద్రదుర్గాధిపతికూడా. 'చూద్దాం. ఏది ఎలా జరుగుతుందో!' అన్నాడు విజయుడు. 'తుపానేమిటి, భూకంపం వచ్చినా ఈరాత్రి కరుణను విడిపించక తప్పదు' అనుకొంటున్నాడు అతను మనసులో.

క్షణక్షణం చీకటి గాఢమవుతున్నది. పడవ భీమవర్మ నివాసం దరిదాపులకు చేరుకునేసరికి అంతటా కటికచీకటి కమ్ముకొన్నది. కన్ను పొడుచుకున్నా కానరావటంలేదు. గాలికూడా బొత్తుగా సద్దుమణిగింది. 'వచ్చేశాం' అన్నాడు విజయుడు. ఎప్పుడు పడవ ఒడ్డుకు చేరుతుందా, ఎప్పుడు క్రిందికి ఉరుకుదామా అని ఊగిసలాడుతున్నాడు అతను.

ఎలాగైతేనేం పడవ భవనంప్రక్కనే ఒడ్డుకు చేరుకొన్నది. విజయుడు ముందు క్రిందికి దూకేశాడు. అతనివెనుకనే ఇంకా కొంతమందికూడా దూకారు. 'మిగిలిన వాళ్లంతా పడవలో ఉండండి. మేము ముందు పోయి స్థితిగతులు ఎలా ఉన్నాయో చూసివస్తాం' అన్నాడు విజయుడు. అలాగేనని చంద్రదురాధిపతితోసహా మిగిలిన వాళ్లంతా పడవలోంచి క్రిందికి దిగలేదు.

మేఘాలు ఆకాశంలో కుప్పతిప్పలుగా ప్రోగుకాసాగాయి. చుక్కలన్నీ మటుమాయమయ్యాయి. అకస్మాత్తుగా పెనుగాలి విజృంభించింది. విజయవర్మ తన అనుచరులతో జాగ్రత్తగా అడుగడుక్కీ ఆగుతూ ముందుకు సాగాడు. భవనం వెనుకవైపు గనుక కాపలావాళ్ళు ఎవరూ ఉండరని అతని ధైర్యం.

ఇంతలో అతని అనుచరులలో ఒకడు ఒక చిన్న బండకు కొట్టుకొన్నాడు. బండ అలాగే పల్లాన పడి దొరులుకొంటూ పోయింది. ఇంకేముంది, భవనం గోడమీది నుంచి ఒక బాణం రివ్వున వచ్చి అతని



అనుచరులలో ఒకనికి తగిలింది. 'వెనక్కు తగ్గండి!' అని విజయుడు ఆజ్ఞాపించే లోగానే పైనుంచి బాణాలవర్షం కురియ సాగింది. అతని అనుచరులు వెనుతిరిగి పరుగెత్తారు.

ఇంతలో వర్షం, గాలీ ఒక్కమారే ప్రారంభమైనాయి. ఆ తుపాను హోరులో పారిపోతున్నవారి కేకలూ, వెంబడిస్తున్న వారి కేకలూ కలిసి మరింత కోలాహలం చెలరేగింది.

ఎలాగైతేనేం, విజయవర్మ, అతని వెంటనున్నవారూ పడవను సమీపించారు. కాని పడవ ఒడ్డునే లేదు. అప్పుడే పెను గాలిమూలాన నదిలో రేగుతున్న తరంగాల వల్ల ఒడ్డుకు దూరంగా వెళ్ళిపోయింది. దానిని మళ్ళీ ఒడ్డుకు చేర్చటానికి పానయ్యా వశం కావటంలేదు.

వెనుకనుంచి శత్రువులు తరుముకు వస్తున్నారు. ధారాపాతంగా వర్షం కురుస్తోంది. హోరుగాలివల్ల కాలు నిలపటానికి వీలులేకుండా ఉంది. మధ్యమధ్య మెరిసి పట్టపగలుగా చేస్తున్న మెరుపుల వెలుగులో శత్రువులకు గురి బాగా చిక్కుతున్నది. ఇక ఆలోచించటానికికూడా వ్యవధి లేదు. విజయవర్మా అతని అనుచరులూ నిర్భయంగా నదిలో దూకేసి పడవవైపు ఈదుకొనిపోసాగారు.

శత్రువులు ఒడ్డునవచ్చి నిలబడి ఈదుతున్నవారిమీదనే గాక, పడవలో ఉన్నవారి మీదకూడా బాణాలు కురిపించసాగారు. నదిలోనే బాణాలు తగిలినవారు అంతులేకుండా కొట్టుకుపోయారు. పడవ ఎక్కుతూ ఉండగా బాణాలు తగిలినవారు జారి ఏట్లోపడి కొట్టుకుపోయారు. పడవ మీద ఉన్నవారికికూడా కొంతమందికి గాయాలు తగిలాయి. వారికి బొత్తుగా రక్షణ లేకుండా ఉంది. వారుకూడా సాహసం వీడకుండా బాణాలు వదలసాగారు. కాని




రాళ్లచాటున పొదలమాటున దాక్కోవటానికి శత్రువులకు కావలసినంత అవకాశం ఉంది.

వారి దాడి ఈ విధంగా అగచాట్లపాలై ఊరుకొంది. చివరకు ప్రాణాలు దక్కించుకొని బయటపడితే చాలునని దేవునికి మొక్కుకోసాగారు. తుపానుతాపులకు పడవ ఎండుటాకులా వూగుతున్నది. ఈ క్షణమో మరుక్షణమో తల్లక్రిందులయ్యేటట్టు ఉంది. పడవమీద హాహాకారం చెలరేగింది.

'పడవ అవతలి ఒడ్డుకన్నా జేర్చుపొనయ్యా!' అన్నాడు రొప్పుతూ విజయవర్మ. కాని ఆ తుపానులో పడవను అవతలి ఒడ్డుకు చేర్చటమంటే మాటలా?

ఇంతలో ఒక బాణం వచ్చి చంద్రదుర్గాధిపతికి తగిలింది. గాయపడి క్రింద పడిన అతనిని పెడగా మోసుకెళ్ళారు. గాయం గట్టిగా తగిలింది. ప్రాణభయం కూడా ఉన్నందువల్ల అతడు విజయుణ్ణి పిలవసాగాడు. విజయుడు వెళ్ళి విచారంగా అతనిప్రక్కన నిలబడ్డాడు.

'అబ్బాయీ! నీవు ఏ పక్షంవాడివి? బీసల్పూరా? కోసల్పూరా?' అని అడిగాడు అతను. 'భీమవర్మ కోసల్పూరువాడు. అతడు నాకూ చండీదాసుకూ శత్రువు. అందువల్ల మీరు మమ్మలనికూడా బీసల్పూరువాళ్లేనని అనుకోవచ్చు' అన్నాడు, తాను ఏ పక్షానికి చెందినవాడో కూడా తెలియని విజయుడు.

'అయితే విను: అసలు నేను ఈ నగరం వచ్చింది కరుణకోసం కాదు. కరుణ ఇక్కడ ఉన్నదనికూడా నాకు తెలియదు. నే నిక్కడకు వచ్చింది శత్రువుల బలాబలాలు కనుక్కోవటానికి. ఆ పని కొంత వరకు నెరవేరింది. కాని నేను అసలు బ్రతుకుతానా, లేదా? అనే అనుమానం కలుగుతున్నది. నేను నీకొక వ్యక్తిపేరు

చెబుతాను. నేనే చనిపోయినపక్షంలో నీవు ఆ వ్యక్తివద్దకు వెళ్ళి ఇక్కడి స్థితిగతు లన్నీ చెప్పాలి. అతడు నిన్ను బీసల్‌పురా ధీశ్వరునికికూడా పరిచయంచేస్తాడు. ఏమో నీ అదృష్టమెలా వుందో ఎవరు చెప్పగలరు' అన్నాడు చంద్రదుర్గాధిపతి.

'మరి కరుణసంగతి ఏమిటి?' అన్నాడు విజయుడు. 'ఆ విషయం ఇక నేనేమీ చేయలేను. ఇక నీవు ప్రయత్నించుకోవల సిందే. ఇవ్వాళ నాచేతనైనది చేశాను' అన్నాడు చంద్రదుర్గాధిపతి. 'కాని మీరేమీ నిరాశ చెందనక్కరలేదు. మనం శత్రువుల బాణాల బారిని దాటి వచ్చేశాం. కొంచెం సేపటిలో ఒడ్డుకు చేరుకుంటాం. మీ గాయంకూడా మానిపోతుంది' అన్నాడు విజయుడు.


'ఏది ఎలాగైనా నా చింత తీరిపోయింది' అన్నాడు చంద్రదుర్గాధిపతి.


నిజంగా మరికొంతసేపటిలో వారు ఒడ్డుకు చేరుకొన్నారు. అప్పుడే తూరుపు కొంచెం తెలతెలవారుతున్నది. విజయవర్మా అతని అనుచరులూ పడవను రేవులో కట్టి వేసి ఖిన్నహృదయాలతో ఒడ్డుకు దిగారు. చంద్రదుర్గాధిపతి అనుచరులు గాయపడిన తమ యజమానిని మోసుకుంటూ బసకు తరలిపోయారు.

ఆ రాత్రి కరుణను విడిపించటానికి వారు చేసిన ప్రయత్నం ఈ విధంగా విపత్కరంగా పరిణమించింది.

అయితే ఈ ప్రయత్నంవల్ల విజయుడికి చంద్రదుర్గాధిపతి స్నేహంమటుకు లభించింది. 'ఇకముందు కరుణను విడిపించ టానికి నాకెవ్వరి సహాయమూ అక్కరలేదు. స్వశక్తిమీదనే ఆధారపడతాను' అను కొన్నాడు విజయుడు వజ్రసంకల్పంతో.

—(ఇంకా ఉంది)






[ భీమవర్మ మకాం దేవపూర్‌లో. కరుణను బలవంతంగా మరెవరికో యిచ్చి వివాహం చేసేటందుకు నిర్ణయించాడు. ఈ రహస్యం విన్న విజయవర్మ, చంద్రదుర్గాధిపతితో కలిసి భీమవర్మ నివసించే భవనంమీద దాడిచేశాడు. దాడి విఫలమయింది. చంద్రదుర్గాధిపతి గాయపడ్డాడు. విజయవర్మ తిరిగి తన నివాసం చేరాడు.—ఇక చదవండి]

విజయవర్మ తన అనుచరులందరినీ ఆ పాడుపడిన సత్రంలో సమావేశపరిచాడు. భీమవర్మ బారినుండి కరుణను రక్షించేటందుకు మార్గాంతరాలు ఆలోచించసాగారు. భీమవర్మ కరుణను ఎవరికో ఇచ్చి రహస్యంగా వివాహం జరపబోతున్నాడనే విషయం ఆ కిందటిరాత్రి తాము చాటుగా విన్న సంభాషణనుబట్టి తెలిసిపోయింది. అయితే, ఈ బలవంతపు పెళ్లికి అంగీకరిస్తున్న ఆ వరుడెవరు ?

"వాడెవరో తెలుసుకోవాలంటే యీ సత్రంలో కూర్చుని కబుర్లాడితే లాభంలేదు. సరాసరి భీమవర్మ భవనంలోకే జొరబడాలి. అప్పుడుగాని తెలియదు" అన్నాడు పడవల పానయ్య.

"భేష్, భేష్ ! పానయ్యా, నువ్వు బుద్ధికి బృహస్పతివేయ్ !" అన్నారు అంతా.

"బాగానే వుంది ఆలోచన. కాని, పిల్లికి గంట కట్టేదెవరు?" అన్నాడు విజయవర్మ.

"ఇంకెవరు ? మనిద్దరమే. తెలిసిందా? బయలుదేరు !" అంటూ లేచి నిలబడ్డాడు పానయ్య.

విజయవర్మ తన అనుచరులకు 'జాగర్తగా మసులుకోండి' అని హెచ్చరిక



చేసి పానయ్యతో కలిసి బయలు దేరాడు. పానయ్య సరాసరి అరణ్యంలోకే దారితీశాడు. కొంతదూరం కాలిబాటల వెంట సాగినతరవాత, పానయ్య ఆ బాట తప్పించి విజయవర్మను ఒకానొక గుబురు చెట్లమధ్యకు తీసుకుపోయాడు.

పట్టపగలే గాఢాంధకారమయంగా వున్న ఆ చెట్లమధ్యలో, పానయ్య తన నివాసాన్ని విజయుడికి ఎరుకపరిచాడు. అల్లిబిల్లిగా అల్లుకొన్న అడవితీగల మధ్యన కొన్ని ఎండుకొమ్మలు పరిచి, వాటిమీద చింకి చాపలతో ఒక చిన్న గదిలాగా తయారు చేశాడు అతను.


"ఇదే నా గృహం. బాగా వుందా!" అని అడిగాడు విజయవర్మను.

"నేను నీ గృహాన్ని చూసేటందుకు రాలేదు. కరుణను విడిపించడం ఎలాగో ముందు ఆలోచించాలి. నువ్వు చెపుతానన్న ఆ ఉపాయం ఏమిటి?" అని గద్దించాడు విజయవర్మ, కోపంగా.

పానయ్య నవ్వుతూ, అక్కడవున్న చింకిచాపల కిందనుండి కొన్ని పాతగుడ్డలు బయటికి లాగాడు. అనుమానంగా చూస్తున్న విజయుడికి వాటిని చూపుతూ—

"మనం భీమవర్మ భవనంలో జొరబడాలంటే మారువేషాలతో వెళ్ళాల్సిందే. అన్నిటికన్నా తేలికగా అమరేది సన్యాసి వేషం. పైగా, కావలసిన చోటుకల్లా జొరబడేందుకు ఆ వేషం అవకాశమిస్తుంది" అన్నాడు పానయ్య.

ఈ వుపాయం విజయవర్మకు బాగానే నచ్చింది. పానయ్య తన వేషం నిమిషాల మీద మార్చుకున్నాడు. కాషాయవస్త్రాలూ, మెడలో రుద్రాక్షమాలా, చేత కమండలం —చూడగా హిమాలయాలనుంచి అప్పుడే దిగివస్తున్న యతీశ్వరునిలాగా తయారయ్యాడు. విజయవర్మకుకూడా ఇదేవేషం బాగా అమరింది. సన్యాసివేషాల్లో అంచక్కగా




అమరిపోయిన వాళ్ళిద్దరూ ఒకళ్లకేసి ఒకళ్లు చూచుకొని నవ్వుకున్నారు.

"జైసీతారాం!" అన్నాడు పానయ్య.

"జైసీతారాం!" అన్నాడు విజయవర్మ.

"ఎందుకైనా మంచిది—ఈ 'జైసీతారాం' తోపాటు ఇంకా ఒకటిరెండు వాక్యాలు కూడా గుర్తుపెట్టుకో. 'అలగ్ నిరంజన్' 'సర్వం కల్మషం బ్రహ్మం'—" అన్నాడు పానయ్య.

పడవలపానయ్య అమాయకత్వానికి విజయవర్మ నవ్వుకున్నాడు. వచ్చీరాని మాటలను నోటికిఅందినట్టుగా అనేయడమే తప్ప వాటిలోని అర్థం, భావం, పావిత్ర్యం పానయ్యకేమీ అవగాహన అయినట్టులేదు.

ముందు పానయ్య దారితీయగా, వెనకనే విజయవర్మ బయలుదేరాడు. వారు సరాసరి ఆ అడవి దాటి నర్మదానదీ తీరానికి వచ్చారు. అక్కడ పడవలవాళ్ల కోలాహలం అపరిమితంగా ఉంది.

"రాత్రి నా పడవని కాజేశారు. అది పత్తాలేకుండా పోయింది. ఆ దుర్మార్గులెవరో తెలిస్తే నిలువునా ప్రాణాలు తీసేద్దును" అన్నాడు ఒక పడవల ఆసామీ.

అతనిచుట్టూ చేరినవారిలో చాలామంది ఇదేధోరణిలో ఉన్నారు. మా పడవ పోయిందంటే మా పడవ పోయింది అని చెబుతూ పరుషవాక్యాలు పలుకుతున్నారు. ఇది చూడగా, ఉన్నట్టే వుండి విజయవర్మకి భయంకూడా పట్టుకున్నది: కొంపతీసి వీళ్లలోఎవరైనా తమను గుర్తుపడతారేమోనని.

"జై-సీతారాం!" అంటూ పానయ్య ఆ గుంపును సమీపించాడు. "బిడ్డల్లారా! ఏమిటీ గోలఅంతా?" అన్నాడు.

ఈప్రశ్నతో పడవలవాళ్లంతా పానయ్యనీ, విజయవర్మనీ చుట్టుముట్టారు. అసలే గుండెబితుకుతోవున్న విజయుడికి, పొరపాటువల్ల పానయ్య రహస్యం కాస్తా బయటపడేస్తా




డేమో అని అనిపించింది. అయినా, యింత దాకా వచ్చింతరవాత తను చేయగలిగిం దేముంది ? చూస్తూ వూరుకున్నాడు.

"రాత్రి గాలివానలో మా పడవలను ఎవరోగాని కాజేశారు. అవి యిప్పుడు ఎక్కడ వున్నవో, ఆ చోరులెవరో కాస్తంత అంజనంవేసి చెప్పగలవా నాయనా? నీమేలు మరవం" అన్నారు పడవలవాళ్లు.

"యీపాటిదానికే అంజనాలెందుకయ్యా బిడలారా ?" అన్నాడు పడవల పానయ్యా. తరువాత చెయ్యెత్తి నర్మదా నదికి అవలనున్న దేవపూరుకేసి చూపుతూ "మీ పడవలన్నీ నర్మదానదీ గర్భంలో వున్నాయి. వాటిని దొంగిలించిన చోరులు అదుగో, ఆ కనబడే భవనంలోనే వున్నారు. తెలిసిందా ?" అన్నాడు.

ఈమాటలు పడవలవాళ్ళలో ఎక్కడలేని రోషాన్ని పుట్టించినై. "పదండి ! పదండి !! ఆ చోరుల్ని హతమార్చాలి. మన కడుపుకొట్టారు, దుర్మార్గులు! వాళ్ళను బతకనివ్వకూడదు !!" అంటూ ఎవరిచేతికి అందిన ఆయుధం వాళ్ళు తీసుకున్నారు.

ఇదంతా ఎంతో చోద్యంగా చూస్తున్నాడు విజయవర్మ. పడవలపానయ్యా యుక్తికీ, సందర్భశుద్ధికీ అతడు లోలోపల ఆనందిస్తున్నా—ఏ పొరపాటుమాటవల్ల అసలు రహస్యం బయటపడుతుందోనని భయపడుతూనే ఉన్నాడు.

"బిడ్డల్లారా ! తొందర పనికిరాదు" అని హెచ్చరించాడు పానయ్యా. "మా ఇద్దరినీ నది అవతలఒడ్డుకు చేర్చండి. దేవపూరులోని ఆ భవనంలో విడిది చేసివున్న సామంతుల గుట్టుమట్లన్నీ తెలుసుకు వస్తాం. తరువాత మీ పగ తీర్చుకోవచ్చు" అన్నాడు.

"ఐతే బాబులూ! మీరు మళ్ళీ ఎప్పుడు తిరిగివస్తారు ?" అని ఆత్రంతో అడిగారు పడవలవాళ్ళు.


"ఎప్పుడోనా! వెంటనే. అన్యాయాలకు పాల్పడిన మీవంటి అమాయకులకు న్యాయం కలగచేయటమే మా విధి. మమ్మల్ని ముందు నదిదాటించండి. మరొక్కమాట: ఆ భవనంలోనుంచి నది దాటివచ్చే భటులనెవరినైనాసరే, మేం తిరిగి వచ్చేవరకు ఇక్కడనే బంధించివుంచండి!" అంటూ ఆజ్ఞయిచ్చాడు పానయ్య.

ఈ మాటలకు పడవలవాళ్లంతా పరమానంద భరితులయ్యారు. 'మన పాలిట దేవతలల్లే వచ్చారు ఈ యతీశ్వరులిద్దరూ' అనుకున్నారు. వెంటనే ఒక పడవమీద విజయవర్మనూ, పానయ్యనూ ఎక్కించి నది దాటించారు.

భవనంలో భీమవర్మ బస చేసివున్న ప్రాంతాన పడవ నిలుపుచేయించారు విజయవర్మ, పానయ్య. అక్కడ భవనమంతా కోలాహలంగా వుంది. వందలాది జనులు పోగయ్యారు. భవనంలోపలినుంచి మంగళ వాద్యాలు వినబడుతున్నయ్.

"ఏదో పెళ్ళికి ఏర్పాటులాగుంది. కరుణను బలవంతంగా యెవరికో కట్టబెట్టబోతున్నారు!" అన్నాడు విజయవర్మ.

ఈ మాటలేమీ పట్టించుకోకుండా పానయ్య 'జైసీతారాం' అనుకొంటూ జనంలో కలిసిపోయి, భవనంలోకి దారి తీశాడు. విజయవర్మకూడా పానయ్య






లాగానే 'జైసీతారాం' అనుకొంటూ అతనిని వెంబడించాడు.

విజయవర్మ అనుమానం నిజమే అని తేలిపోయింది. భవనంలో అటూ యిటూ తిరుగుతున్న దాసదాసీజనాన్ని చూసినా, అక్కడ పోగైన జనం చెప్పుకునే మాటలు విన్నా—ఇది కరుణకు జరగబోయే బలవంతప్పెళ్లి అని తెలుస్తూనేవుంది. మరి వరుడెవరో ?

విజయవర్మను బాధిస్తూవున్న ఈ సంశయంకూడా ఇట్టే తేలిపోయింది. రంగురంగుల వస్త్రాలు ధరించి, విలువగల ఆభరణాలతో వున్న ఇద్దరుముగ్గురు వ్యక్తులు ఒక పక్కగా చేరి కేరింతలు కొడుతున్నారు. 'జైసీతారాం' అంటూ పానయ్య వారిదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

"ఓహో, యెవరో సాధువులలాగా ఉన్నారే! మన ప్రశ్నలకు వీళ్ళు జవాబు చెప్పగలరేమో చూతాం" అన్నాడు వాళ్లల్లో ఒకడు.

పానయ్య కమండలం పైకెత్తి "బిడల్లారా! ఏమిటోయ్ మీ సందేహం ?" అని గంభీరంగా అడిగాడు. విజయవర్మ పక్కనే నిలబడి చూస్తున్నాడు.

"కబంధవర్మతో కరుణ వివాహం సక్రమంగా జరుగుతుందా ?" అని ప్రశ్నించారు వాళ్ళు.

"అలాంటి సంశయం మీకేల కలిగింది?" అని అడిగాడు పానయ్య నొసలు పైకెత్తి, కళ్ళు పెద్దవిచేస్తూ.

"త్రికాలజ్ఞులైన మీకే ఆ కారణం తెలిసి ఉండవలసింది. అయినా మీది చండీదాసుముఠా కాదుగదా ?" అన్నాడు ఒకడు.

ఆ మాటలతో విజయవర్మ గతుక్కుమన్నాడు. పానయ్య మాత్రం నిబ్బరంగా—

"బిడ్డా! నువ్వు మాట్లాడేది మాబోటి త్రికాలజ్ఞులకు తెలియందికాదు. ద్రోహీ,



బందిపోటు దొంగలనాయకుడూ అయిన చండీదాసుతో మమ్మల్ని కలపడం మహాపరాధం. ఇందుకు నిన్ను శపించవలసింది. కాని ప్రథమతప్పుగా క్షమిస్తున్నాము" అన్నాడు గుడ్లెర్రచేస్తూ.

పానయ్య ఇలా అనేసరికి ఆ ముగ్గురు వ్యక్తులూ హడిలిపోయారు. "క్షమించండి మహాత్ముల్లారా!" అంటూ వారు పానయ్యా విజయవర్మల పాదాలమీద పడ్డారు.

"లేవండి, లేవండి పిచ్చివాళ్లల్లారా!! క్షమించాం" అన్నాడు పానయ్య. "హిమాలయాలలో అరువదేండ్లు తపస్సుచేసింది, మీబోటి మూర్ఖులవల్ల నిందలు మోసేటందుకు కాదు. పొండి, క్షమించాం. కరుణతో కబంధవర్మ వివాహం నిరాఘాటంగా జరిగిపోతుంది" అని అంటూనే అక్కడి నుండి బయలుదేరాడు పానయ్య.

విజయవర్మకు విపరీతమైన కోపం వచ్చింది. కబంధవర్మనుగురించి లోగడనే అతడికి కొంత తెలుసు. 'యాభైయ్యో పడి నడుస్తున్న కబంధవర్మకూ, కరుణకూ వివాహమా? భీమవర్మ తలపెట్టిన ఈ దుండగాన్నుంచి కరుణను ఎలా అయినా కాపాడాలి' అనుకొన్నాడు విజయవర్మ. పానయ్య ఊరికే 'జైసీతారాం' అంటూ భవనమంతా కలయ తిరుగుతున్నాడు. సన్యాసుల వేషంలో వున్న వారిద్దరినీ, ఏ రాజభటులూ అటకాయించలేదు. ఐహిక సుఖాలను ఆశించనివారిని చూస్తే ఎవరికీ అనుమానం ఉండదుకదా!

కాసేపు అలా తిరిగినతరువాత విజయవర్మ పానయ్యను పక్కకు పిలిచాడు. జనసమ్మర్దం లేని ఒక ఏకాంతస్థలంలో ఇద్దరూ కూర్చున్నారు. ముందు కర్తవ్యాన్ని గురించి చర్చ ప్రారంభించారు.

"ఈ పెళ్ళిని ఎలాఅయినా నిలుపు చేయాలి. వెంటనే మనం సత్రం చేరటం మంచిది. అక్కడనుండి కొంతమందిని

తీసుకు రావచ్చు" అన్నాడు విజయవర్మ.

"అదేమీ లాభంలేదు. ఇంకొక్క అర గంటలో పెళ్ళివారంతా అడవిలోని గుడికి తరలివస్తారు. గుడిలోనే వివాహం. మనం మనుషులను వెంటబెట్టుకుని తిరిగివచ్చే టంత వ్యవధి లేదు" అన్నాడు పానయ్య.

"అయితే కరుణకు ఈ ముసలివాడితో బలవంతప్పెళ్ళి జరగవలసిందేనా?" అన్నాడు విజయవర్మ కోపంగా.


నవ్వాడు పానయ్య. తరవాత విజయ వర్మకు సంజ్ఞచేసి, దూరాన గోడను అను కొని నిలబడివున్న ఒకనిని చూపించాడు. విజయవర్మ ఆశ్చర్యానికి మేరలేకపోయింది. అలా గోడపక్కగా నిలబడి పెండ్లియేర్పాటు లన్నీ కనిపెట్టిచూస్తున్న వ్యక్తి చండీదాసు అనుచరుడు. విజయవర్మ చుట్టూ కలయ జూసి 'జైసీతారాం' అంటూ అతడిదగ్గరకు వెళ్ళాడు. తరువాత వంగి, అతడి హస్త రేఖలను పరీక్షిస్తున్నవాడిలా నటిస్తూ—

"ఒక అరగంటలో పెండ్లిమురా అంతా అడవిలోని దేవాలయానికి వచ్చేస్తారు. వ్యవధి లేదు. ఈ సంగతంతా తొందరగా చండీదాసుకు తెలియపరుచు" అన్నాడు. వాడు నివ్వెరపోతూ 'మీరెవరు?' అన్నాడు

"నేనెవరో తెలియుడంలేదా? పోనీ, అదీ మంచిదే. ముందు తొందరగా చండీదాసు దగ్గరకు పో!" అన్నాడు విజయవర్మ. చండీ దాసు అనుచరుడు తలవూపి, అక్కడ నుండి చకచకా వెళ్ళిపోయాడు.

కాస్సేపటికల్లా పెళ్లివారంతా అడవిలోని దేవాలయానికి బయలుదేరారు· మంగళ వాద్యాల కోలాహలం, గుంపులు గుంపులుగా చూడవచ్చిన జనం సందడీ—అంతా గందరగోళంగా ఉంది. పానయ్య విజయ వర్మలుకూడా వాళ్ళతోపాటు దేవాలయానికి బయలుదేరారు. —(ఇంకా వుంది)






[విజయవర్మ, పానయ్యా సన్యాసివేషాలు ధరించి భీమవర్మ నివాసభవనానికి వెళతారు. అక్కడ కరుణను కబంధవర్మ అనే ఒక వృద్ధుడికి యిచ్చి వివాహం చేయబోతున్నారని తెలుసుకుంటారు. చండీదాసుకు అతడి అనుచరుడిద్వారా యీ వార్తను పంపి, పెండ్లి వారితోపాటు రహస్యంగా అడవిలోని దేవాలయానికి బయలుదేరతారు. ఆటుతరువాత—]

అరగంటసేపటికల్లా పెండ్లివారు అడవిలోని దేవాలయం చేరారు. పెండ్లికి పౌరోహిత్యం వహించేది భీమవర్మ ప్రాణమిత్రుడైన సోమశర్మ అనేసంగతి అప్పటికిగాని విజయవర్మకు తెలిసిందికాదు. తోడిసామంతులతో కలిసి వినోదంగా మాట్లాడుతూ, భీమవర్మ మాంచి ఉత్సాహంలో ఉన్నాడు. తను విజయవర్మనూ, శబ్దవేధినీకూడా కనుగప్పి కరుణకు వివాహం విజయవంతంగా చేయబోతున్నా ననుకుంటున్నాడు.

దేవాలయంలోనుంచి సోమశర్మ బయటికి వచ్చి, వధూవరులను సమీపించాడు. చెప్పలేని విచారంతో, వంచిన తల ఎత్తకుండావున్న కరుణనూ, ఆ పక్కనే వున్న వృద్ధ కబంధవర్మనూ దీవించాడు. ఆ నిమిషంలో, ఇక బలవంతపు పెండ్లి తప్పదేమో అనిపించింది విజయవర్మకు.

సోమశర్మ ముందునడవగా వధూవరులు అతనిని అనుసరించారు. ఒక్కసారి అడవి ప్రతిధ్వనించేలాగా మంగళతూర్యారావాలు మోగినై. అదే సమయంలో దేవాలయం చుట్టుపక్కలనున్న గుబురుచెట్లనుంచి ఒకేమారు రెండు బాణాలు రివ్వుమంటూ వచ్చి, ఒకటి సోమశర్మ భుజంలోనూ,




రెండవది కబంధవర్మ గుండెలోనూ గుచ్చుకుపోయినై!!

జనంలో హాహాకారాలు బయలుదేరినై. 'శబ్దవేధి! శబ్దవేధి!! వెతకండి చెట్లల్లో!!!' అంటూ భీమవర్మ కేకలుపెట్టాడు. గుండెలో అంబు గుచ్చుకున్న కబంధవర్మ, తీరని బాధతో పెద్దకేకపెట్టి, వెల్లకిలా పడి, ప్రాణం వదిలాడు. సోమశర్మమాత్రం భుజంలో గుచ్చుకొన్న బాణాన్ని చేతితో లాగి, అవతల విసరివేస్తూ—

"ఈ దురంతం శబ్దవేధిది కానే కాదు; విజయవర్మది! వాడూ యీ చుట్టుపక్కలే వుంటాడు. వెతకండి" అంటూ గర్జించాడు.

భీమవర్మ భటులు కొందరు పెండ్లి చూసేందుకు వచ్చిన ప్రజలందరినీ చుట్టు ముట్టారు; మరికొందరు దేవాలయం చుట్టు పక్కల వున్న పొదలనూ, అడవిప్రాంతాన్నీ గాలించసాగారు.

విజయవర్మకు ఒకపక్కన సంతోషం, మరొకపక్కన విపరీతమైన భయం పట్టుకొన్నది. ఏదోవిధంగా వృద్ధ కబంధవర్మను చంపడంతో కరుణకు బలవంతపు పెళ్ళి తప్పింది. కాని చుట్టుముట్టి మనిషి మనిషినీ పరీక్షించి చూస్తున్న భీమవర్మ భటుల బారినుండి తనూ పానయ్యా బైట పడటం ఎలా? ఇది ఒక పెద్ద సమస్య ఐ కూర్చుంది.

"ఏం పానయ్యా, ఏమిటీదారి ఇప్పుడు?" అంటూ ఆత్రంగా ప్రశ్నించాడు విజయవర్మ.

"దారా దారి!" అని విస్తుపోయాడు పానయ్య. అతడికి పుట్టిమునిగిందిరా అని అనిపిస్తోంది. చివరికి చిత్తరపోయి అటూ యిటూ చూస్తూ "జైసీతారాం! అదే మనకు దారి. ప్రాణాలుంటే బ్రతుకుమార్గం; చస్తే ముక్తిమార్గం!" అనేశాడు.

"జై సీతారాం!" అన్నాడు విజయవర్మ, అంతకన్న చేసేదేమీ లేదనుకుంటూ.

"జై సీతారాం! హర హర హర..."



పానయ్యా యీ హరహరలు ముగించక ముందే సోమశర్మ పదిమంది భటులతో అతడిముందుకు వచ్చి నిలబడ్డాడు.

"ఎవరూ యీ జై సీతారాంగాళ్ళు ?" అంటూ గుడ్లురిమాడు.

"మేం... మేం...హిమాలయాల్లో అరవై ఏళ్లు తపస్సుచేసి..."

"అరవైఏళ్ళ తపస్సా? నిండా మీకు ముప్పయి ఏళ్ళన్నా లేవే! బంధించండి వీళ్లని," అంటూ ఆజ్ఞాపించాడు సోమశర్మ.

"తపస్సు అరవైఏళ్ళు కాదు...యిరవై ...పది...." అని పానయ్యా తడబడుతూ చెప్పబోతున్నాడు.

"బంధించండి వీళ్ళని. దొంగ సన్యాసులు," అని గద్దించాడు సోమశర్మ. వెంటనే భటులు విజయవర్మకూ, పానయ్యకూ అరదండాలు తగిలించారు.

అరదండాలు చేతికి పడటంతో అంతా ముగిసిపోయిందని అనిపించింది విజయవర్మకు. యిప్పుడు కాకపోతే ఇంకాస్సేపటికయినా తనెవరో సోమశర్మా, భీమవర్మా గ్రహించగలరు. తరవాత జరగబోయేది ఏమిటో స్పష్టంగా తెలుస్తూనే వుంది. తనకూ, పానయ్యకూ కూడా బలవ...! విజయవర్మ ఈవిధంగా ఆలోచిస్తున్నంతలో, అక్కడికి భీమవర్మ మరి కొందరు కోసల్వారు సర్దారులతో కలిసి వచ్చాడు. అతడి ముఖాన కత్తి వాటుకుకూడా నెత్తురుచుక్క లేదు. అంతా సక్రమంగా, సవ్యంగా జరిగిపోతున్న సమయానికి, ఇలాంటి అవాంతరం రావడం అతడికి పట్టరాని కోపాన్ని తెప్పించింది.

సోమశర్మ విజయవర్మనూ పానయ్యనూ చూపుతూ—"వీళ్ళు దొంగసన్యాసులు. బహుశా చండీదాసు ముఠావాళ్లయి వుంటారు!" అన్నాడు భీమవర్మతో.

భీమవర్మ, విజయవర్మను సమీపించి నఖశిఖపర్యంతం నిప్పులు చెరిగే నేత్రాలతో



పరికించిచూశాడు. తరవాత హఠాత్తుగా ఏదో తెలుసుకున్నవాడిలా విజయవర్మ గడ్డం పట్టుకుని గుంజాడు. గుంజేసరికల్లా, ఆశ్చర్యం కలిగించేటట్టుగా అతికించుకున్న విజయవర్మ గడ్డం గభీమని భీమవర్మ చేతిలోకి వచ్చేసింది.

"హఁహ్హహ్హఁ!" అంటూ భావగర్భితంగా నవ్వాడు భీమవర్మ. తరవాత సోమశర్మ కేసి తిరిగి—

"వీళ్ళు చండీదాసు ముఠా అనేనా నీ అభిప్రాయం!" అన్నాడు.

"అవును. తెలుస్తూనేవుంది. ఆ దొంగ గడ్డం, దొంగ చూపులూ..."

"విజయవర్మ ఎందుకు కాకూడదు?" అంటూ పెద్దపెట్టున నవ్వాడు భీమవర్మ. "అవునా విజయా!" అంటూ విజయవర్మ బుజం తట్టాడు.

సోమశర్మ ఆ మాటలతో కంపించి పోయాడు. చుట్టూవున్న కోసల్పూరు సర్దారులు ఆశ్చర్యంతో కళ్లప్పగించి చూస్తున్నారు. విజయవర్మమాత్రం తొణక్కుండా—

"అవును నేను విజయవర్మనే! నీకూ, సోమశర్మకూ కూడా బద్ధశత్రువును!" అన్నాడు.

"బోనులో చిక్కకముందు బద్ధ శత్రువువే! కాని ఇప్పుడు......? సరే, ఈ యతీశ్వరు లెవరు?" అన్నాడు భీమవర్మ వేళాకోళంగా.

"అతడా? అతడు నా కుడిబుజం. పడవల పానయ్య!!"

"ఓహో, పడవల పానయ్యగారా!" అంటూ భీమవర్మ పెద్దగా నవ్వాడు. చుట్టూ ఉన్నవాళ్లుకూడా పొట్ట చెక్కలయ్యేలా నవ్వసాగారు. భీమవర్మ కుడిచేతితో అందరినీ వారించి, ఎడమచేతితో పానయ్య గడ్డం పట్టుకు గుంజుతూ—

"పడవల పానయ్యగారు, ఆ వ్యాపారంలో కన్న ఈ వ్యాపారంలో గిట్టుబాటు ఎక్కువగా




వుంటుందని భావించారన్న మాట!" అన్నాడు, వేళాకోళంగా.

ఈ మాటలతో తిరిగీ అక్కడ చేరిన వాళ్ళంతా పెద్దగా నవ్వారు. పానయ్యకు ఆ సమయంలో ప్రాణభీతి అనేదే గుర్తు లేకుండా పోయింది. కోపంతో పళ్లు పటపట కొరుకుతూ యిలా అన్నాడు:

"మేము బోనులో చిక్కవచ్చు. కాని, మిమ్మల్ని బోనులో చిక్కించుకునేందుకు తయారుగా వున్న చండీదాసును మట్టుకు మరిచిపోకండి. అభయవర్మను చిత్రవధ చేసిన హంతకులను అతని పుత్రుడు విజయవర్మ హతమార్చలేకపోతే, చండీదాసు ఆ పని ముగించగలడుసుమండీ!"

పానయ్య పరుషంగా అన్న ఈ వాక్యాలు భీమవర్మతోపాటు అతడి అనుచరులను కూడా నిర్విణ్ణులను చేసినై. నిశ్చేష్టుడయ్యాడు సోమశర్మ. అతడి నోట మాట లేదు. అపాదమస్తకమూ గాలితాకుడు తిన్న గరికపోచలాగా వూగిసలాడిపోతున్నాడు.

భీమవర్మ ఓ క్షణంపాటు తల వంచుకుని వుండిపోయాడు. ఏదో ఒక నిర్ణయం తక్షణం చేయవలసివుందనీ, విజయవర్మను యిక జీవాలతో పోనివ్వగూడదనీ అతడు నిశ్చయించుకొన్నాడు.

"నలుగురు రాజులు చేరినచోట న్యాయం చరిస్తుందని న్యాయశాస్త్రాలు ఘోషిస్తున్నయ్. దీనికి అందరూ అంగీకరిస్తారా?" అన్నాడు భీమవర్మ:

"అంగీకరిస్తున్నాం!" అంటూ సర్దారులు అందరూ ఏకకంఠంతో పలికారు. అప్పటికి సోమశర్మ తేరుకొని యిలా ప్రారంభించాడు:

"వీళ్లని శత్రుసైనికులుగా పరిగణించనవసరంలేదు. హంతకులు... సామాన్య హంతకులు... ధర్మశాస్త్రాలుకూడా..."

"సోమశర్మా ఆగు!" అంటూ భీమవర్మ అతడి మాటలకు అడ్డువచ్చాడు. "వీళ్ళు హంతకులకన్నా నీచులు. ఆధ్యాత్మిక



పరులైన యతీశ్వరులకుకూడా, వీళ్లు దొంగ వేషాలతో అవమానం కలిగించారు. పవిత్రమైన దేవాలయ ప్రాంగణాన్ని రక్తసిక్తం చేశారు. పెండ్లిబట్టలతో వున్న కబంధవర్మను..."

"వీళ్ళకు మరణశిక్ష విధించేందుకు వీటిల్లో ఏ ఒక్క నేరంఅయినా సరిపోతుంది!" అన్నాడు సోమశర్మ కోపం పట్టలేక.

"అయితే వీళ్లకు మరణశిక్ష విధించాను. గొంతుకు వుచ్చు బిగించి ప్రాణం పోయే వరకూ చెట్టుకు వేలాడతీయడంద్వారా ఆ శిక్షను అమలుజరపాలి. ఏం?— అందరికీ సమ్మతమేనా?" అంటూ భీమవర్మ చుట్టూ చూశాడు.

"సమ్మతమే! మాకందరకూ సమ్మతమే!" అంటూ సర్దారులందరూ ఏకకంఠంతో పలికారు. కాని, అదేసమయంలో కంచు ధ్వనిలాంటి ధ్వనితో యీ వాక్యాలు వినిపించినై—

"దేవపూర్ జమీందారును నేను! మీరంతా కేవలం నా అతిథులుమాత్రమే. నా అనుమతి లేకుండా యిక్కడ న్యాయ విచారణ జరిగేందుకు వీలులేదు!"

భీమవర్మ, సోమశర్మలతోపాటు అందరూ ఆ ధ్వని వచ్చినవైపుకి తిరిగిచూశారు. దేవపూర్ జమీందారు పదిమంది సైనికులతో అక్కడికి రావడం కనిపించింది. గౌరవ సూచకంగా అందరూ ఆయనకు అభివాదనం చెప్పి ఆహ్వానించారు.

దేవపూర్‌జమీందారు రాకతో విజయవర్మ, పానయ్యలలో తిరిగీ ధైర్యోత్సాహాలు కలిగినై. నిజం ఆలోచిస్తే కబంధవర్మ హత్యకు కారణం తాముకాదు. తమను హంతకులని నిర్ణయించేటందుకు ఏ న్యాయాధిపతికీ సాధ్యం కాదు. మహా అయితే కబంధవర్మ హంతకులతో సంబంధం కలిగివున్నారని మాత్రమే నేరం

మోపటానికి వీలవుతుంది తమమీద! దేవపూర్ జమీందారును చూసేసరికి భీమవర్మకు అరికాలిమంట నెత్తికెక్కింది. పానకంలో పుడకలాగా వీడేమిటి యిలా తయారయ్యాడు అనుకున్నాడు. కాని తను కత్తితో చేయగలిగిందేమీ లేదు; అంతా ఉపాయంతో సాధించాలిసిందే! అందుకనే ఇలా అన్నాడు—

"వీళ్ళిద్దరూ హంతకులు! పెండ్లిదుస్తులతో వున్న కబంధవర్మను హత్యచేశారు."

"వీళ్ళదగ్గిర కత్తులూ, కఠారులూ ఉన్నట్టు లేవే?" అంటూ తన అనుమానాన్ని బయటపెట్టాడు దేవపూర్ జమీందారు.

"బాణంతో అతన్ని హత్యచేశారు. నేను కొద్దిలో బ్రతికి బయటపడ్డాను. ఈ మారు వేషాలలో వుండటమే వీళ్లు హంతకులని తెలియపరుస్తోంది" అన్నాడు సోమశర్మ.

"యీ దేవపూర్ సంస్థానంలో మారు వేషం వేసినంతమాత్రాన ఎవరినీ హంతకులుగా పరిగణించము. బాణంవేసి కబంధవర్మను హత్య చేశారనేటందుకు సాక్ష్యంవున్నట్టు లేదు. సరే... అంతా మేం న్యాయవిచారణ చేయగలం," అన్నాడు దేవపూర్ జమీందారు.




విజయవర్మనూ, పానయ్యనూ దేవపూర్ జమీందారు వెంటవున్న సైనికులు కైవశం చేసుకున్నారు. చేసేదేమీ లేక విస్తుపోయి చూస్తున్న భీమవర్మ, అతడి తోడి సర్దారుల ముందునుంచే ఖైదీలను నడిపించుకు పోసాగాడు. భీమవర్మ యిక ఉండబట్టలేక:

"దేవపూర్ సంస్థాన శాసనాలకు మేం బద్ధులం. యిక్కడ కేవలం అతిథులం అన్నసంగతికూడా మాకు తెలుసు. కాని కోసల్పూరుప్రభువుకు వ్యతిరేకి అయిన వాణ్ణి, మీరు సహించి వదలలేరు అని నమ్ముతున్నాం," అన్నాడు.

ఆ మాటలతో దేవపూర్ జమీందారు తక్కున ఆగిపోయాడు. సాలోచనగా భీమ వర్మను సమీపించి తగ్గుస్థాయిలో మంత నాలు జరిపాడు. తరవాత అతడిదగ్గిర నుంచి సెలవుతీసుకొంటూ—

"మన మంతా కోసల్పూరుప్రభువుల అనుచరులమే! బీసల్పూరు ద్రోహులతో చేయికలిపినవా డెవడూ ప్రాణాలతో నా దగ్గిరనుంచి బయటపడలేడు. అలా అని మీ అందరికీ వాగ్దానం చేస్తున్నాను" అన్నాడు.

సోమశర్మ, భీమవర్మలు ఆ మాటలతో పరవశులయ్యారు. పానయ్యకు పైప్రాణం పైనే పోయినట్టయింది. కాలే పెనంమీద నుంచి మండుతూవున్న పొయ్యిలో పడి నట్టయిందే పరిస్థితి అనుకున్నాడు విజయ వర్మ. కాని విధికి తల ఒగ్గి గుండెబిగువుతో వూరుకున్నాడు.

దేవపూర్‌జమీందారు సైనికులు ఖైదీ లను ముందు నడవమన్నారు. ఆ అడవి ప్రాంతందాటి పట్టణం సమీపించేసరికి విజయవర్మకు హఠాత్తుగా కరుణ గుర్తు కొచ్చింది. కబంధవర్మ గుండెల్లో బాణం తగలగానే రేగిన గగ్గోలులో కరుణ ఏమ యిందీ తను చూడనే లేకపోయాడు.


"కరుణ ఏమైనట్టు?" అని అడిగాడు పానయ్యను విజయవర్మ.

"ఏమయితేనేం? ముందు మనసంగతి ఆలోచించు!" అన్నాడు పానయ్య.

"నడవండి! ఊc!" అంటూ దేవపూర్ జమీందారు సైనికులు వాళ్లను గద్దించారు. మృత్యుముఖంలోకి సరాసరి నడుస్తున్నా మనుకొంటూ పానయ్య, విజయవర్మలు భావించసాగారు. కొద్దిసేపటిలో వారు దేవ పూర్ జమీందారు భవనం చేరుకొన్నారు.

—(ఇంకా వుంది)






[కరుణను బలవంతంగా వివాహం ఆడదలచిన కబంధవర్మ, చండిదాసు అనుచరుల బాణాలకు బలిఅవుతాడు; సోమశర్మ గాయపడతాడు. సన్యాసివేషాల్లో వున్న విజయవర్మా, పానయ్యల్ని భీమవర్మ గుర్తించి వురిశిక్ష విధిస్తాడు. కాని, శిక్ష అమలుజరిపే సమయానికి దేవపూర్ జమీందారు అక్కడికి వచ్చి; హంతకులను విచారించే హక్కు తనదే-అని భీమవర్మతో వాదించి, వారిద్దరినీ తన భవనానికి తీసుకుపోతాడు. అటుతరువాత—]

మొదటినుంచీ దేవపూర్ జమీందారు కోసల్పూరుపక్షమువాడే. ఏ పక్షం అనుకూలంగా వుంటే ఆ పక్షంతో చేతులుకలిపే భీమవర్మ అంటే అతడికి మంట. కోసల్పూరు రాజపక్షంవారు బలవంతులు కనుకనూ, వాళ్లని ఓడించాలంటే ఎవరు ఎంతటి సాయంచేసినా—తమకు ఉపయోగమే కనుకనూ, కోసల్పూరువాళ్ళు భీమవర్మను ఉపయోగించుకొంటున్నారు. భీమవర్మ నిలువెల్లా దగాకోరేసనే సంగతి ఎరిగి వున్నాడు దేవపూర్ జమీందారు. సమయం చిక్కింది కనుక అతడి బద్ధవిరోధులైన విజయవర్మ ముతాద్వారా అతడి రహస్యాలు కనుక్కోవాలనుకున్నాడు. ఆ అవకాశం యీనాడు లభ్యమైంది.

న్యాయస్థానంగా ఏర్పడివున్న మందిరంలో దేవపూర్ జమీందారు ఆసీనుడైనాడు. విజయవర్మనూ, పానయ్యనూ సైనికులు ఆయన ఎదటికి తీసుకవచ్చారు. 'చిక్కాము. ఆ దేవదేవుడు తప్ప మనలను




ఎవరూ రక్షించలేరు' అని వాళ్లిద్దరూ భావించసాగారు. రణరంగంలో వీరమరణం పొందవలసిన తనకు—ఈ ఉరూపేరూ లేని చావు సంప్రాప్తమవుతున్నదే అని విజయవర్మ దిగులుపడసాగాడు.

దేవపూర్ జమీందారు పానయ్యా, విజయవర్మలవైపు సాలోచనగా చూసి ఇలా అడిగాడు—

"నిజంచెప్పండి! మీరు ఏపక్షంవాళ్లు ?"

ఇంతటి సూటిప్రశ్న వస్తుందని పానయ్యా, విజయవర్మా భావించిఉండలేదు. తమని బీసల్పూరువాళ్ళనుగా భీమవర్మ చెప్పినసంగతి, దేవపూర్ జమీందారు నమ్మివుంటాడని తలచిన వారికి, ఈ ప్రశ్న ఆశ, ఆశ్చర్యంకూడా కలిగించింది. అయినా, నిజం చెప్పకతప్పదు. అబద్ధం చెప్పి నమ్మించేందుకు అవగింజంతకూడా అవకాశంలేదు. తమని కోసల్పూరు పక్షీయులు పట్టి బంధించడంతో, తాము బీసల్పూరుపక్షీయులని తేలిపోతూనేవుందికదా!

దేవపూర్ జమీందారు ప్రశ్నకు విజయవర్మ యిలా జవాబిచ్చాడు :

"నేను బీసల్పూరు పక్షంవాణ్ణే. ఇతడు మాత్రం ఏపక్షానికి చెందడు. ఒకానొక సందర్భంలో నాతో స్నేహం కలిసి, అప్పటి నుంచీ నాకు అండగా వుంటున్నాడు. ఇతడి పేరు పానయ్య! పడవలు నడిపే వృత్తి."

కల్లా కపటం లేకుండా విజయవర్మ ఇచ్చిన యీ జవాబుతో దేవపూర్ జమీందారు సంతృప్తిచెందినట్టు కనిపించాడు. అతడి ముఖాన చిరునవ్వు కదిలింది.

"నువ్వు అభయవర్మకు తగిన పుత్రుడవనిపించావేయ్ విజయవర్మా!" అన్నాడు. "మీ తండ్రిని నే నెరుగుదును. కాల పరిస్థితులకు అనుగుణంగా మనం కదలకపోతే ఎంత ప్రమాదకరమో, మీ తండ్రి జీవితమే మనకు నేర్పుతుంది. మీ తండ్రి చిత్రహింసలకు గురిఅయి మరణించాడనేది


దేశంలో అంతా ఎరిగిన విషయమే. నేను కోసల్పూరువాణ్ణి. అయినా నిన్ను క్షమించి వదులుతున్నాను."

"మరి పానయ్య సంగతి?" అన్నాడు విజయవర్మ, జమీందారు అన్న వాక్యంలోని అర్థాన్ని గ్రహించి.

"వదలవలిసిన పనిలేదు. వాణ్ణిగురించి చాలాకాలంగా నేను వింటున్నాను. ఈ ప్రాంతంలో అంత పేరుమోగిన దగాకోరు మరొకడు ఉండడు. గొంతుకు వుచ్చుతగిలిస్తే కాస్త బాధపడినా, వాడికీ ఇతరులకీ తరవాత ఎంతో హాయి!" అన్నాడు జమీందారు.

జమీందారు మాటలు వింటూంటే, పానయ్యకు నిజంగానే గొంతుకు వుచ్చు బిగిస్తున్నట్టు తోచింది. దీనంగా విజయవర్మకేసి చూశాడు. విజయవర్మ గట్టి నిశ్చయానికి వచ్చినవాడిలా తల పంకించి దేవపూర్ జమీందారుకేసి తిరిగి ఇలా అన్నాడు:

"మీ దయకు పాత్రుణ్ణయినందుకు నేనెంతో గర్విస్తున్నాను. నిజం చెప్పాలంటే నాకు కోసల్పూరు—బీసల్పూరు రాజవంశీకుల తగాదాలతో ఏమాత్రం ప్రసక్తి లేదు. భీమవర్మ, సోమవర్మలు నా తండ్రికీ నాకూ చేసిన అన్యాయాలకు బదులుగా పగతీర్చుకోవడమే నా వుద్దేశం. కనుక నన్ను





క్షమించదలిస్తే, నా స్నేహితుడైన ఈ పానయ్యనూ క్షమించమని కోరిక."

విజయవర్మ గంభీరస్వరంతో ఇలా అనేసరికి, దేవపూర్ జమీందారు ముఖంలో క్షణకాలం కలవరపాటు కనబడింది. ఒక్కమారు దీర్ఘంగా నిట్టూర్చి—

"సరే, మీ ఇద్దరినీ వదిలిపెడుతున్నాను. మీరుమాత్రం ఇటుపైన నా కంటికిగాని, నా సైనికుల కంటికిగాని ఈ పరిసరాలలో కనబడకూడదుసుమా. పోండి!" అన్నాడు.

విజయవర్మా, పానయ్యా జమీందారుకు నమస్కరించి స్వేచ్ఛగా బయటికి వచ్చేశారు. ఇక ఆ ప్రాంతాన్నుంచి ఎంతత్వరగా



బయటపడి, తమతమ నివాసాలు చేరితే అంత శ్రేయస్కరమని వాళ్ళకు తెలియనే తెలిసింది. అందులోనూ భీమవర్మ సైనికుల బారి పడకుండా తప్పించుకుపోవడం ముఖ్యం.

వాళ్ళిద్దరూ అడ్డదారుల వెంట నడిచి అడవి చేరుకొనేసరికి సూర్యాస్తమయం కావచ్చింది. విజయవర్మా, పానయ్యా ఆకలితో నకనకలాడిపోతున్నారు. ముందు భోజనం, తరవాత విశ్రాంతి తప్ప చేయగల పనికూడా వాళ్లకు తోచలేదు.

"నేను నా రహస్యగృహానికి వెళుతున్నాను. నువ్వు సత్రం చేరుకొంటావా?" అని అడిగాడు పానయ్య, విజయవర్మను.

"అదే ఆలోచిస్తున్నాను. మనం తలపెట్టిన కార్యం పూర్తి కాకపోయినా, కొంతవరకైనా ఫలించింది. కరుణను రక్షించి వెంట తీసుకు రాలేకపోయినా, ఆ బలవంత పెళ్ళినుంచి రక్షించగలిగాం. ముందు కర్తవ్యం రేపు ఆలోచించవలసిందే. నేను సత్రానికి వెళతాను" అన్నాడు విజయవర్మ.

పానయ్య అడవిలోని తన రహస్య గృహంవైపు నడిచాడు. విజయవర్మ సరాసరి సత్రంకేసి నడవసాగాడు. కాని, అతడు సత్రం సమీపించకముందే, అతడిని వెతుకుకొంటూ ఇద్దరు అనుచరులు రావడం కంటబడింది. విజయవర్మ ఏదో ప్రమాదం సంభవించిం దనుకుంటూ వారికి త్వరత్వరగా ఎదురువెళ్ళాడు.

అనుచరు లిద్దరూ విజయవర్మను సమీపించారు. ఎంతో వుత్సాహంగా వున్న వాళ్ళ ముఖకవళికలను చూసేసరికి, విజయవర్మకు వాళ్ళు ఏదో శుభవార్త తెస్తున్నారనిపించింది.


"ఏమిటీ విశేషాలు?" అన్నాడు విజయవర్మ ఎంతో ఆత్రంగా.

"చాలా వున్నాయ్. సత్రం చేరగానే అన్నీ చెబుతాం. ముందు యీ వుత్తరం

"చూడండి!" అంటూ అనుచరులలో ఒకడు ఒక వుత్తరం విజయవర్మకు యిచ్చాడు.

విజయవర్మ వుత్తరం ఒకటిరెండు మార్లు చదువుకున్నాడు. చంద్రదుర్గాధిపతి, బీసల్వారు రాజునుంచి పిలుపు రాగా తన అనుచరులతో బయలుదేరి వెళ్ళిపోయాడు. అక్కడికి ఇరవైమైళ్ళదూరంలో బీసల్వారు—కోసల్వారు సేనలమధ్య పెద్దయుద్ధం సాగే సూచనలు వున్నట్టు తెలిసి, అతడి కా పిలుపు వచ్చింది. విజయవర్మను జాగ్రత్తగా మసులుకోవలిసిందనీ, అనుచరులతో కలిసి ఏ నిమిషానికైనాసరే యుద్ధానికి బయలు దేరేటందుకు తయారుకావలసిందనీ హెచ్చరిస్తూ వ్రాసిన ఉత్తరం అది.


ఆ ఉత్తరం విజయవర్మకు అపరిమితానందం కలిగించింది. ఎట్టకేలకు కోసల్వారు రాజ్యప్రాంతం రణరంగం కాబోతున్నందుకు అతడికి చాలా సంతోషం కలిగించింది. ఈ దెబ్బతో భీమవర్మ దర్పం ఏమిటో తెలిసిపోతుందనీ, అసలు అతడు విడిదిచేసివున్న నర్మదానదీతీరపు భవనమే కదనరంగం కాగలదనీ విజయవర్మ భావించాడు.




అనుచరులతో కలిసి విజయవర్మ సత్రం చేరాడు. అక్కడ పరిస్థితి అంతా కోలాహలంగా వుంది. వేగుచూడబోయిన కొందరు రకరకాల వార్తలు పట్టుకువచ్చారు. వందలూ వేల సంఖ్యలో ఏవో సైన్యాలు అడవిదారుల వెంట కదలివస్తున్నట్టు వారు చెప్పసాగారు.

"ఈ అడవిలో చెట్లకంటె అందులో తిరుగులాడే సైనికుల సంఖ్య అపారం. నా కళ్లతో నేను చూశా" నన్నాడు ఒకడు.

అనుచరులు చెప్పే ఈ వార్తలు వింటూ విజయవర్మ, భోజనం ముగించాడు. అప్పటికి రాత్రి చాలా పొద్దుపోయింది. అనుచరులలో కొందరు నిదురిస్తూవుండగా, మరి కొందరు వంతులుప్రకారం ఆ చుట్టుపట్ల




కావలికాయడానికి నియమించి తనూ నిద్రించాడు.

తెలతెల్లవారుతూండగా విజయవర్మకు మెలకువ వచ్చింది. సైనికదుస్తులు ధరించి, స్వయంగా ఆ చుట్టుపట్ల పరిస్థితులు ఎలావున్నదీ చూచి వచ్చేటందుకు బయలుదేరాడు.

అడవిప్రాంతం యింకా మసకచీకటిగానే వుంది. జాగ్రత్తగా దారిచూసుకుంటూ విజయవర్మ ఆ చెట్లమధ్య నడవసాగాడు. అలా కొంతదూరం నడిచేసరికి హఠాత్తుగా అతడి చెవులకు దగ్గరలోనే పెద్ద ధ్వని వినబడింది. ఆ క్షణంలోనే విజయవర్మ ఒరనుంచి కత్తి లాగి ఆ ధ్వని వచ్చినవైపు పరుగెత్తసాగాడు.

గుబురుచెట్లు దాటుకొని ఒక ఖాళీ మిట్ట ప్రదేశందగ్గరకు వచ్చేసరికి— విజయవర్మ నిశ్చేష్టితుడయ్యాడు.

ఒకేఒక వ్యక్తిని ఐదారుగురు సైనికులు చుట్టుముట్టారు. కత్తులతో నరకబోతున్నారు. చుట్టుముట్టబడిన ఆ వ్యక్తి సైనికుల కత్తి దెబ్బలను కాచుకుంటూ, అవకాశం దొరికినప్పుడల్లా వారిని గాయపరుస్తున్నాడు.

"వస్తున్నా. భయపడకు. నిలబడు. ధైర్యంగా నిలబడు!" అని కేకలువేస్తూ విజయవర్మ ఆ యోధులకేసి పరుగెత్తసాగాడు. అలా యుద్ధానికి తలపడినవాళ్ళెవరో అతడికి తెలీదు. కాని ఒకేఒక వ్యక్తిని ఐదారుగురు యోధులు చుట్టుముట్టి హతమార్చటంమాత్రం అధర్మంగా కనబడింది విజయవర్మకు.

నిస్సహాయుడైనా ధైర్యంతో అంతమంది శత్రుసైనికులకు కత్తితో జవాబు చెబుతున్న వీరుడు, విజయవర్మ మాటలతో ఎక్కడలేని వుత్సాహం తెచ్చుకుని ఒకరి తరవాత ఒకరిని గాయపరచసాగాడు. అంతలో విజయవర్మ వెనకనుంచి ఆ సైనికులను ఎదుర్కొన్నాడు.

విజయవర్మ సమీపించేసరికే ఆ వీరుని కత్తిదెబ్బకు ఒక సైనికుడు కూలాడు. మరొకడు గాయపడి బాధతో విలవిల తన్నుకొంటున్నాడు. విజయవర్మ రావడంతో తక్కిన సైనికులు హడలెత్తి పలాయనమయ్యారు.

అలా పలాయనమైపోతున్న సైనికులలో ఒకరిని విజయవర్మా, వేరొకణ్ణి ఆ వీరుడూ కత్తికి బలిచేశారు. ఆతరువాత ఒకరిని మరొకరు అప్పుడే గుర్తించినట్టు ఎదురూ బొదురుగా నిలబడిపోయారు.

"సమయానికి సహాయపడ్డారు. మీరెవరు?" అని అడిగాడు ఆ వీరుడు విజయవర్మను. విజయవర్మ ఆ వీరుడి కంఠస్వరంలోని హుందానూ, గాంభీర్యాన్నీ చూసి నివ్వెరపోయాడు. ఆ నిమిషంలోనే, అతడు మామూలు సైనికుడు కాదనీ, తగినంత ప్రాముఖ్యం గలవాడే అయివుంటాడనీ గ్రహించాడు.

"నేను రావటం కొంచెం ఆలస్యమైంది. నాది సమయానికి అంతగా అక్కరకు రాని సహాయం అయినందుకు విచారిస్తున్నాను. నేను రాకపోయినా మీరు ఆ సైనికులందరినీ పరిమార్చివుండేవారు" అన్నాడు విజయవర్మ.



విజయవర్మ మాటలకు ఆ వీరుడు జవాబిచ్చేటంతలో, ఒక్కసారిగా పరుగెత్తి వస్తున్న గుర్రపుదళంచేసే ధ్వని వినబడింది. కాసేపటికల్లా నాలుగైదువందల మంది అశ్వసైనికులు అక్కడికి వచ్చి ఆగారు. వాళ్ల దళ నాయకుడు ముందుగా అశ్వాన్ని దిగి, ఆ వీరుణ్ణి సమీపించి—

"ప్రభువుల ఆజ్ఞప్రకారం నా దళంతో వచ్చాను. చంద్రదుర్గాధిపతి వేయిమంది సైనికులతో ఈ సాయంకాలానికల్లా వస్తారు. తమ ఆజ్ఞ!" అన్నాడు.

"అదుగో ఆ చెట్లవెనకనే మన గుడారాలు ఉన్నాయి. ముందు చేయవలసిన

దేమిటో నిర్ణయిస్తాను. సైనికులందరూ గుర్రాలు దిగి ఇక్కడే ఉండేటట్టు అజ్ఞాపించి, నువ్వూ, ఈయనా కలిసి ఆ గుడారాలవద్దకు రండి!" అనిచెప్పి ఆ వీరుడు వెళ్ళిపోయాడు.

విజయవర్మకు యిదంతా ఆశ్చర్యం కలిగించింది. కాసేపటిలో అశ్వదళనాయకుడు, సైనికులకు వారి విధులు చెప్పి విజయవర్మ దగ్గరకు వచ్చాడు. ఎంతో కుతూహలంగా వున్న విజయవర్మ దళనాయకుణ్ణి ఆ వీరుడెవరని ప్రశ్నించాడు.

"ఎవరో తెలియదా? బీసల్వారు ప్రభువు!" అన్నాడు దళనాయకుడు.


విజయవర్మ ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. తలవనితలంపుగా, తను సరాసరి బీసల్వారుప్రభువుకే సాయం వచ్చినందుకు తనను తాను అభినందించుకున్నాడు. భీమవర్మా, సోమశర్మల అంతం కనుక్కునేందుకు సమయం వచ్చిందికదా అన్న వుత్సాహంతో విజయవర్మ, దళనాయకుడితో కలిసి బీసల్వారు ప్రభువు విడిసిఉన్న గుడారాలకేసి బయలుదేరాడు.


బీసల్వారు ప్రభువు, విజయవర్మను గౌరవపూర్వకంగా తన గుడారంలోకి ఆహ్వానించాడు. అతిథి మర్యాదలను జరిపి, తరవాత సంభాషణ ప్రారంభించాడు:

"నేనెవరో యీసరికి మీకు తెలిసే వుంటుంది. ఇక మీ సంగతి నాకుతెలియ చెప్పండి!" అని అడిగాడు.

'నా పేరు విజయవర్మ' అని తప్ప అంతకన్న తను చెప్పుకోగలిగింది ఏమీ వున్నట్టు కనబడలేదు. ఐనా, ఏముంది? తనింతవరకూ ఏ గొప్ప యుద్ధంలోనూ పాల్గొన్నదిలేదు. పెద్ద సాహసకృత్యాలా నెరపిఉండలేదు.

[వచ్చే సంచికలో ముగింపు]






[విజయవర్మ, బీసల్పూరు ప్రభువు ప్రశ్నకు వెంటనే ప్రత్యుత్తరం యివ్వక తటపటాయించాడు. అయేసరికి, మళ్ళీ ఆయన అదే ప్రశ్న అడిగాడు. అందుకు బదులుగా—]

" నాపేరు విజయవర్మ !" అని మాత్రం చెప్పగలిగాడు విజయుడు.

" మిమ్మల్ని గురించి నేను తెలుసుకోవలసింది ఇంతేనా?" అని ప్రశ్నించాడు బీసల్పూరు ప్రభువు. తరువాత తల పంకిస్తూ యిలా అన్నాడు:

" మీరు ఏ పక్షంవాళ్ళు? బీసల్పూరా—కోసల్పూరా?"

" నేను బీసల్పూరు పక్షంవాణ్ణే!" అన్నాడు విజయవర్మ గంభీరస్వరంతో.


" ఈ మాటకు రుజువేమైనా వుందా?" అని అడిగాడు బీసల్పూరుప్రభువు అనుమానిస్తూ. కాని అంతలోకే చిరునవ్వు నవ్వుతూ " మిమ్మల్ని అనుమానించానని అనుకోవద్దు. ఈనాటి పరిస్థితులలో ఎవరు ఏనాటికి ఎలా మారిపోతారో చెప్పలేము!" అన్నాడు.

తనను అనుమానించేసరికి విజయవర్మకు ఎక్కడలేని కోపం వచ్చింది.

" నేను చంద్రదుర్గాధిపతిని ఎరుగుదును. నా గురించి ఆయనకు బాగా తెలుసు" అన్నాడు విజయవర్మ.

చంద్రదుర్గాధిపతి పేరు చెవిని పడేసరికి, బీసల్పూరుప్రభువు ముఖం ప్రసన్నమైంది.

" సరే, ఇక నీగురించి నాకు అనుమానాలేమీ లేవు. ఈ వున్న సైన్యంతో దేవపూర్ జయించవచ్చునని నేను అభిప్రాయపడు



తున్నాను. నాకన్న నీవు ముందునుంచీ ఈ ప్రాంతంలో ఉన్నవాడివి కనక, నీ అభిప్రాయం అడుగుతున్నాను. దాపరికం లేకుండా మాటాడు" అన్నాడు బీసల్వారు ప్రభువు.

క్షణకాలం ఆలోచించాడు విజయవర్మ.

"మన సైనికబలం ఎంతో తెలిస్తే నేను మీకు తగిన సలహా ఇవ్వగలను!" అన్నాడు.

"నా వెంట గుర్రపుదళం, కాల్బలం— అంతా కలిసి పద్దెనిమిది వందలమంది వుంటారు. సాయంకాలానికి దాదాపు వెయ్యి మంది సైనికులతో చంద్రదుర్గాధిపతి మనకు సాయం వస్తాడు!" అన్నాడు బీసల్వారు ప్రభువు.

"అలాంటిపక్షంలో మనం దేవపూర్‌ను పూర్తిగా జయించలేకపోయినా, శత్రువుల్ని దెబ్బతియవచ్చు" అన్నాడు విజయవర్మ.

"అయితే మన వ్యూహం ఏమిటి?" అని అడిగాడు బీసల్వారు ప్రభువు.


"మనం ఎంత హఠాత్తుగా దేవపూర్ మీద దాడి చేయగలిగితే విజయం అంతగా మనకు సుకరమవుతుంది. దేవపూర్‌కూ, ఈ అడవికీ మధ్యవున్న మైలుపొడవు ఖాళీ ప్రదేశాన్ని శత్రువులు చూడకుండా మనం దాటితే, వాళ్లను నిరాయుధులుగానే మనం నుగ్గునుగ్గు చేయవచ్చు" అని చెప్పాడు విజయవర్మ.

"సరే, దాడికి ఏర్పాట్లు చేయించు. ఈ పరిసరాలు బాగా తెలిసినవాడివి కనక, ఈ కార్యభారం నీమీదనే వుంచుతున్నా" అంటూ బీసల్వారుప్రభువు గుడారంలోంచి లేచాడు.

విజయవర్మ ఆజ్ఞమేరకు, బీసల్వారు అశ్వికదళాలు ముందు కదిలినై. వెనక బారులు తీరి పదాతి సైనికులు నడవసాగారు. విజయవర్మా, బీసల్వారు ప్రభువూ రెండు ఉత్తమాశ్వాలను అధిరో

హించి సైన్యానికి ముందు బయలుదేరారు. కొద్దిసేపట్లో సైన్యమంతా దేవపూర్‌వైపు అడవి చివరకు చేరారు.

బీసల్వారు ప్రభువుతో విజయవర్మ సంప్రదించాడు. ముందు గుర్రపుదళం శరవేగంతో ఆ ఖాళీప్రదేశాన్ని దాటి, అక్కడికి చేరువలో వున్న దేవపూర్ పొలిమేరను ఆక్రమించాలి. వెనుకనే కాల్బలం వచ్చి చేరితే-తరవాత ముందుకు చొచ్చుకుపోవచ్చు.





బీసల్వారు ప్రభువు అజ్ఞాపించాడు. మొత్తం గుర్రపుదళం అడవినుంచి బయటకు వచ్చి శరవేగంతో దేవపూర్‌కేసి పరుగెత్తసాగింది. అదే సమయంలో దేవపూర్‌లో గుడిగంటలు మోగజొచ్చినై. హెచ్చరిస్తూ తప్పెటలూ బాకాలూ మోగినై.

"మనం రావటాన్ని శత్రువులు పసికట్టారు. అయినా ఫరవాలేదు. ముందు మనం ఆ కనబడే పొలిమేర ప్రాంతంలోని యిళ్ళను ఆక్రమించుకో గలిగితే, వాటిని రక్షణగా పెట్టుకుని శత్రువులను నిలువరించవచ్చు" అన్నాడు విజయవర్మ.

"మంచి ఆలోచన! మనం పట్టణాన్ని ఆక్రమించుకోలేకపోయినా, కనీసం కాలు పెట్టగలిగితే అంతే చాలు. సాయంకాలానికల్లా మనకు చంద్రదుర్గాధిపతి బలాలు సాయంగా వస్తయి. అప్పుడు మొత్తం శత్రు సైన్యాలను మట్టుపెట్టవచ్చు!" అని జవాబిచ్చాడు బీసల్వారు ప్రభువు.

బీసల్వారు గుర్రపుదళం దేవపూర్ పొలిమేరలను సమీపించింది. మొత్తంమీద విజయవర్మ ఎత్తు కొంతవరకు విజయం సాధించినట్టే కనబడింది. హఠాత్తుగా వచ్చిన దాడిని ఎదురుకొనేటందుకు సర్వసన్నద్ధంగా లేని భీమవర్మ సైనికులు, నలుగురూ ఐదుగురేసి చొప్పున వచ్చి బీసల్వారు గుర్రపు రౌతులను ఎదుర్కోవటానికి ప్రయత్నంచేశారు. కాని అలాంటి సైనికులందరూ గుర్రపు రౌతుల చేతిలోని



యీటెలకు యిట్టే బలి అయిపోయారు. ఇక పట్టణంలోని ఇతర ప్రాంతాలలో బాకాల మోతా, సైనికుల కోలాహలమూ ఎక్కువయింది.

భీమవర్మ తన సైనికులందరినీ ఎదురు దాడికి సమీకరిస్తున్నట్టు ఆ సందడి తెలియ చెబుతూవుంది. నాలుగు బజార్లు కలిసే కూడలిస్థలాన్ని ఆక్రమించుకొని, విజయవర్మ సైనికులనూ గుర్రపురౌతులనూ నాలుగుగా విభజించి నాలుగు బజారుల మొగదలా, చివరలా రక్షించుకుకో యత్నించాడు.

సైనికులు బజారువరసలలో వున్న ఇళ్ళ తలుపులు బద్దలుకొట్టి, యిళ్ళల్లో వున్న సామానంతా వీధిమొగలో దొంతరులలాగా పేర్చసాగారు. కుర్చీలూ, మంచాలూ, తలుపులూ! ఏవి దొరికితే అవి తెచ్చి వీధి మొగను పెద్ద ఎత్తున పేర్చారు. వాటివెనక ధనుర్బాణాలు ధరించిన కాల్బల సైనికులూ, వాళ్ళకు కొంచెం వెనకగా, యీటెలూ బల్లేలూ పట్టి సిద్ధంగా వున్న గుర్రపురౌతులూ సమాయత్తమయారు.

కాస్సేపటికల్లా భీమవర్మ, తన సైనికులతో ఎదురుముట్టడి ప్రారంభించాడు. కూడలిస్థానంమీద దేవపూర్ జమీందారు నాయకత్వంలో వున్న సైనికులూ, వీధికొసల వైపునుంచి భీమవర్మా, అతని అనుచరుల నాయకత్వంలో వున్న సైనికులూ బాణాల వర్షం కురిపించసాగారు.

అక్కడ ఎదురుదాడిని నడుపుతున్నది స్వయంగా భీమవర్మేనని విజయుడు గ్రహించాడు. కవచం ధరించి, కత్తి ఝుళిపిస్తూ భీమవర్మ తన సైనికులను ఉత్సాహపరుస్తున్నాడు. విజయవర్మ కంట పడగానే—


"రాంసింగ్! అడుగో మన బద్ధశత్రువు విజయవర్మ! వీణ్ణి యీసారి ప్రాణాలతో వదలకూడదు. ప్రాణాలతో పట్టి బంధించినా సరే, తల నరికి తెచ్చినా సరే; అంతా

నేయిష్టం. ఊఁ—ముందుకు...'' అంటూ భీమవర్మ కేకలు పెట్టసాగాడు.

రామసింగ్ పేరు వినేసరికి విజయవర్మ నిశ్చేష్టుడయ్యాడు. తనూ రామసింగూ మునుపు ప్రాణస్నేహితులు. శబ్దవేధి ముసలి గంగులును బాణంతో హతమార్చినప్పుడు—దానికి కట్టివున్న లేఖలో, రాంసింగ్ సోంనగర్ తగలపెట్టినట్లు రాసివుంది. ఆనాటి నుంచీ క్రమక్రమంగా యిద్దరూ ప్రబల శత్రువులయ్యారు.

ఈనాటికి పగ తీర్చుకునే అవకాశం చిక్కిందిగదా అని విజయవర్మ ఎంతో సంతోషించాడు. యింతలో వీధి మొగను పేర్చిన ఆటంకాలను ఒకమూల ఛేదించి రాంసింగ్ లోపలకు జొరబడ్డాడు. రాంసింగ్‌తో బాహాబాహి యుద్ధానికై ఉవ్విళ్ళూరుతున్న విజయవర్మ ఒక్క దూకులో ముందుకు పోయి అతడితో కత్తియుద్ధానికి తలపడ్డాడు.

నాలుగైదు నిమిషాలపాటు పోరు జరిగేసరికి విజయలక్ష్మి ఎవరిని వరించబోతోందో అందరికీ తెలిసిపోయింది. అలసిపోయిన రాంసింగ్ ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తూ, తన సైనికసమూహంకేసి జరగసాగాడు. అపరిమితమైన వుత్సాహంతో పౌరుషంతో విజయవర్మ కవ్విస్తూ కత్తి తిప్పసాగాడు.



సరిగా వీధికి అడ్డంగా పరిచివున్న రక్షణలను సమీపించేసరికి, చెల్లాచెదరైవున్న మంచాలూ కుర్చీలూ అక్కడ పోరాడుతున్న యోధుల కాళ్లకు తగిలినై. వాళ్లు కాలు జారి అటూ యిటూ పడిపోసాగారు. అలాంటి స్థితిలో రాంసింగ్ కాలు జారడం, మరుక్షణాన విజయవర్మ కత్తివెళ్లి అతని తలను మొండెంనుంచి వేరుచేయడం ఒక్కసారిగా జరిగిపోయినై.

ఆ దృశ్యం చూసిన బీసల్పూరుసైనికులు జయజయధ్వానాలు చేశారు. భీమవర్మ సైనికులు భీతితో వెన్నిచ్చి పరిగెత్తసాగారు. భీమవర్మ చేసిన హెచ్చరికలుగానీ, ఇచ్చిన




అజ్ఞలుకానీ పిరికిగుండెతో పారిపోతున్న సైనికులను ఆపి, తిరుగా యుద్ధానికి తలపడేటట్టు చేయలేకపోయినై.

"నీ సాహసానికీ, చాకచక్యానికీ చాలా సంతోషించాను. భీమవర్మ సైనికులు వెన్నిచ్చి పారిపోతున్నారు. ఇదే అదనులో నర్మదా నదీతీరంలోని వాళ్ళ ముఖ్య భవనాన్నికూడా ముట్టడిస్తే మనం పూర్తిగా జయించగలమనుకుంటున్నాను. ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి ?" అని అడిగాడు బీసల్పూరు ప్రభువు.

విజయుడు మారు ఆలోచన లేకుండా ఈ ప్రయత్నానికి అంగీకరించాడు. నర్మదా నదీతీర భవనంలోనే కరుణ బందీకృతురాలై వుంది. ఆమెను ఎంత త్వరగా తను విముక్తురాలిని చేయగలిగితే అంత క్షేమమని విజయవర్మ తలపోశాడు.

భవనంకోసం ఎంతో పోరు జరపవలసి వస్తుందని భావించిన విజయవర్మ నిరాశ చెందాడు. భవన ముఖ్యద్వారంవద్ద ఎదిరించిన కొద్దిపాటి సైనికులనూ, లోపల తలపడిన కొద్దిమందిని హతమార్చడం తృటిలో జరిగిపోయింది. భవనంలోని ఏ ప్రాంతంలో కరుణ బంధింపబడివున్నదో తెలియని విజయవర్మ ప్రతి గదితలుపునూ సైనికుల సాయంతో బద్దలుకొట్టించి వెతకసాగాడు. కాని ఎంత వెతికినా కరుణ కనబడనేలేదు.

నిరాశతో భవనం మెట్లు దిగి కిందికి వస్తున్న విజయవర్మకు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. అతడు సరాసరి భవనం చివరిమెట్లవరకూ ఎక్కి ఒక మూలని బురుజులా ఏర్పడివున్న ఒక చోటునుంచి అడవికేసి చూశాడు.

నలభై యాభైమంది గుర్రపురౌతులూ, కొంత కాల్బలమూ అడవికేసి హుటాహుటిని పారిపోతూవుండడం విజయవర్మ కంటబడింది. వారు తప్పక భీమవర్మవాళ్ళే



అయివుంటారనీ, కరుణనుకూడా బంధించి వెంట తీసుకుపోతున్నారనీ విజయవర్మ గ్రహించాడు. విజయవర్మ తన సైనికులను వెంటబెట్టుకుని, భీమవర్మను వెంబడించాడు. కొద్దిసేపట్లో అడవి సమీపించి, సైనికులకు హెచ్చరిక వేసి లోపలకుజొరబడ్డాడు. మరుక్షణాన్నే గొప్ప యుద్ధం జరుగుతున్న కోలాహలం అతనికి వినవచ్చింది.

ఆ కోలాహలం అడవిలోని దేవాలయ ప్రాంతంనించి వస్తున్నట్టు విజయవర్మ గుర్తుపట్టగలిగాడు. సైనికులను ఆ వైపు కదలండని ఆజ్ఞయిచ్చేటంతలో పడవల పానయ్యా ఒక చెట్టుమీదినించి కిందకి దూకి-

"విజయా! ఇదే మనకు మంచిసమయం. భీమవర్మతో, చండీదాసు స్వయంగా పోరాటానికి తలపడ్డాడు. పద త్వరగా!" అంటూ కేకపెట్టాడు.

విజయవర్మ ఆ ప్రాంతానికి వెళ్ళేసరికి యుద్ధం దాదాపు ముగిసింది. చండీదాసు, పారిపోతున్న భీమవర్మ అనుచరులు కొద్దిమందిని వేటాడేందుకు తన అనుచరులను వుసికొలుపుతున్నాడు. చండీదాసును చూడగానే విజయవర్మ—

"కరుణ ఎక్కడ వుంది? భీమవర్మా, సోమశర్మలు పారిపోయారా?" అని ఆత్రంతో అడిగాడు. జవాబుగా చండీదాసు పెద్ద నవ్వు నవ్వి "కరుణ ఇక్కడే వుంది. భీమవర్మా, సోమశర్మలు వాళ్ళ పాపాలను తలుచుకొంటూ ప్రాణాలు వదిలారు. కత్తిపోటుకు చచ్చిన భీమవర్మా, బాణందెబ్బకు ప్రాణాలు వదిలిన సోమశర్మా యిక్కడనే వున్నారు. కాని, సోంనగర్ తగలపెట్టిన రాంసింగ్ తప్పించుకున్నాడు!" అన్నాడు.

"రాంసింగ్ తప్పించుకుపోలేదు. యింతకుముందే నేను వానిని తుదముట్టించా" అన్నాడు విజయవర్మ.

ఈ జవాబుతో చండీదాసు పరమానంద భరితుడయ్యాడు.

"అయితే ఇక శత్రుశేషం లేదు. నీతండ్రి అభయవర్మను చిత్రవధచేసి చంపిన హంతకులకు తగిన శాస్తి జరిగింది. నా కోరిక నెరవేరింది. వున్నదల్లా ముందు కరుణతో నీ వివాహం. ఈ దేవాలయంలోనే అది జరిపేద్దాం" అన్నాడు చండీదాసు.

అక్కడే ఆ నిమిషాన కరుణతోటి విజయవర్మ వివాహం జరిగిపోయింది. ఆయుధాలు ధరించిన చండీదాసు అనుచరులే పెండ్లిపెద్దలూ, అతిథులున్నూ.

అందరి ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. చండీదాసు యిలా అన్నాడు :

"ఇక మనం సోంగనర్‌కు బయలుదేరుతున్నాం. ఆ ప్రాంతం అంతా నీ తండ్రిదే. భీమవర్మచే సర్వనాశం చేయబడిన ఆ భవనాలనూ వాటినీ తిరుగా నిర్మిద్దాం. ఇక మన జీవితాలు ప్రశాంతంగా గడుపుదాం". అంటూ చండీదాసు ప్రోత్సహించాడు.

మరి చంద్రదుర్గాధిపతిని కలుసుకోవడం ఎప్పుడు? ఆయన కరుణను పెంచిన తండ్రిగదా?" అన్నాడు ఆత్రంతో విజయవర్మ.

"చంద్రదుర్గాధిపతినీ కలుసుకుందాం. వివాహం సంగతి నేను ఆయనకు కబురు చేస్తాను. ముందు సోంనగర్‌కు బయలుదేరాలి" అన్నాడు చండీదాసు.

"అయితే నేనూ సోంనగర్‌కే; నా రహస్యగృహాన్ని ఇంతటితో వదిలేస్తున్నాను" అన్నాడు పడపల పానయ్య.

పానయ్య మాటలకు అందరూ నవ్వారు. విజయవర్మా కరుణలకు; అటూ యిటూ పానయ్యా చండీదాసులు నడవగా, విజయధ్వానాలు చేస్తున్న సైనికులూ అనుచరులూ వెంటరాగా, అందరూ సోంనగర్ కేసి బయలుదేరారు.

—['శబ్దవేధి' ముగిసింది]

